# సఫలీకృతం అవుతున్న "మిషన్ వైవిద్యం"

**స్వచ్ఛందంగా పంట మార్పిడి విధానం వైపు ముందుకు వస్తున్న రైతులు...**
**యాసంగి సీజన్లో వరి వేయవద్దు..**
**వాణిజ్య (ఆరుతడి) పంటల వైపు మొగ్గుచూపాలి..**
**విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి...**
**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**

**మహబూబాబాద్ జిల్లా అక్టోబర్ 24 (ఉదయం జిల్లా ప్రతినిధి) :**



శనివారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో"కేత్ బచావో అభియాన్"* ఎల్ ని నో* పై రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....

ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో ఎల్ ని నో కారణంగా వర్షా బావ పరిస్థితులు ఏర్పడినందున భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి లభ్యత లేనందున రైతులు ఈ యాసంగి సీజన్లో వరి పంట సాగు చేయవద్దని, ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ నీటితో ఎక్కువ లాభాలు పొందే ఆరు తడి పంటలు అపరాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయలు, ఆయిల్ పామ్, పండ్ల తోటలు, మల్బరీ, మునగ, పూలు, ఉల్లి, ఔషధ మొక్కలు, తదితర మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు వేయాలని, అందుకోసం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు సేకరించాలని కోరారు.

మండల పరిధిలో 19 వేల 500 ఎకరాలలో సాగు భూమి ఉందని, మండల పరిధిలో రైతులు 9వేల 800 మంది ఉన్నారని, (78) ట్యాంకులు మండల పరిధిలో ఉన్నాయని నీటి లభ్యత తక్కువగా ఉందని, ప్రతి అంశాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటల సాగు వైపు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయం అన్నారు,

పంట మార్పిడి చేసి ఆదాయం పొందిన రైతులు గుగులోతు గణేష్ నాయక్, (బొప్పాయి), జక్కుల మహేష్, (పెసర), సుభాష్ చంద్రబోస్, (బెండ, టమాటా), నజీర్ పాషా (డ్రాగన్ ఫ్రూట్స్), వాంకుడోత్ విర్యా నాయక్, (ఆయిల్ పామ్), గార్ల సర్పంచ్ బానోతు పార్వతి, పది ఎకరాలలో పెసర్లు, తదితర పంటలు వేసిన వారితో స్వయంగా మాట్లాడుతూ వివరాలను అడిగి తెలుసుకుని రైతులకు తెలియపరిచారు,

విబిజి రామ్ జి గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులు వారి వ్యవసాయ క్షేత్రాల వద్ద పంట కుంట,నీటి కుంట, ఊట కుంట, ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, అలాగే వ్యవసాయ,ఉద్యాన రంగానికి సంబంధించిన వివిధ సబ్సిడీ కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయని రైతులు కచ్చితంగా వాటి వినియోగం ద్వారా ఆర్థిక లాభాలు పొందాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ, విద్యుత్తు, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖ, గ్రామీణ అభివృద్ధి, మిషన్ భగీరథ, సాగునీటి శాఖ, మల్యాల వ్యవసాయ,ఉద్యాన విశ్వవిద్యాలయల శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసిని తదితర విభాగాలకు చెందిన అధికారులు రైతులకు ప్రస్తుత పరిస్థితులను వివరించారు.

అనంతరం ఆత్మ నిర్భర్ భారత్ పథకంలో భాగంగా రైతులకు ఉచితంగా పెసరు విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయచంద్ర, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, ఉద్యానవన శాఖ అధికారి జినుగు మరియన్న, పశు వైద్య అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, ఏడిఏ శ్రీనివాసరావు, ఈఈ మిషన్ భగీరథ పుష్పలత, విద్యుత్ శాఖ SE దర్శన్ కుమార్,

స్థానిక సర్పంచ్ బానోతు పార్వతి, ఆత్మ సభ్యులు వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మండల అధికారి రామారావు, ఉద్యాన అధికారి శాంతి ప్రియ, శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసిని, అన్ని విభాగాల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐ నిహారికను మర్యాదపూర్వకంగా కలిసిన ఉదయం ప్రతినిధులు

**శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా. ఎస్ఐ నిహారిక.**

**నర్సంపేట ఉదయం ప్రతినిది అక్టోబర్ 24.**



నర్సంపేట పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించిన దుగ్గాల నిహారికను ఉదయం తెలుగు దినపత్రిక ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మల్యాల వినయ్ కుమార్ గుప్తా, నర్సంపేట రూరల్ రిపోర్టర్ జక్కా రవీందర్ ఎస్ఐ నిహారికను కలిసి భగవద్గీతను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిహారిక మాట్లాడుతూ నర్సంపేట పట్టణ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ తనవంతు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంపొందించేలా విధులు నిర్వహిస్తూ, శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేస్తానని తెలిపారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా, ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు.ప్రజలు, పోలీసులు, పత్రికా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమాజంలో సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించగలమని పేర్కొన్నారు. పత్రికా ప్రతినిధులు సైతం సమాజంలో తమ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, ప్రజలకు మరియు అధికార యంత్రాంగానికి మధ్య వారధిగా నిలవాలని ఈ సందర్భంగా చర్చించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నిహారికకు ఉదయం ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో ఆమెకు విజయం కలగాలని ఆకాంక్షించారు.

# ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం – 6.0లో భాగంగా వరంగల్ ఎఫ్‌సీఐ డివిజనల్ ఆఫీస్లో స్వచ్ఛత కార్యక్రమాలు





**కాజీపేట, అక్టోబర్ 24, (ఉదయం):**

భారత ఆహార సంస్థ (FCI), డివిజనల్ ఆఫీస్, వరంగల్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం - 6.0 (Special Campaign 6.0)లో భాగంగా కార్యాలయ రికార్డుల క్రమబద్ధీకరణ మరియు గోదాముల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎఫ్‌సీఐ డివిజనల్ ఆఫీస్, వరంగల్‌లో పాత ఫైళ్లను సమీక్షించి, సంబంధిత నిబంధనలు మరియు నిర్దేశిత విధానాల ప్రకారం భద్రపరచాల్సిన రికార్డులను, తదుపరి వెడింగ్ అవుట్ (Weeding Out) ప్రక్రియకు పరిశీలించాల్సిన రికార్డులను వేర్వేరుగా క్రమబద్ధీకరించి, తదుపరి చర్యల నిమిత్తం సిద్ధం చేశారు. దీనివల్ల కార్యాలయంలో రికార్డుల నిర్వహణ మెరుగుపడటంతో పాటు, కార్యాలయ స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు అవకాశం కలుగుతుంది. అదేవిధంగా, ఎఫ్‌సీఐ డివిజనల్ ఆఫీస్, వరంగల్ పరిధిలోని పీడబ్ల్యూఎస్ నెక్కొండ 1 మరియు నెక్కొండ 2 గోదాముల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గోదాముల పరిసరాలు, రహదారులు మరియు ఇతర ప్రాంగణాలను శుభ్రపరిచి, పరిశుభ్రమైన మరియు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం - 6.0 అమలులో భాగంగా ఎఫ్‌సీఐ డివిజనల్ ఆఫీస్, వరంగల్ జారీ చేసిన సూచనలు మరియు మార్గదర్శకాలను అనుసరించి ఈ కార్యక్రమాలు చేపట్టారు. కార్యాలయాల్లో రికార్డుల క్రమబద్ధీకరణ, పరిశుభ్రత, క్రమశిక్షణ మరియు మెరుగైన పని వాతావరణాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం.ప్రభుత్వ కార్యాలయాలు మరియు గోదాముల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రికార్డులను నిబంధనల ప్రకారం నిర్వహించడం మరియు స్వచ్ఛత కార్యక్రమాల లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయడం పట్ల ఎఫ్‌సీఐ డివిజనల్ ఆఫీస్, వరంగల్ నిరంతరం కృషి చేస్తోంది.

# కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో వసతుల కల్పనపై కలెక్టర్ సమీక్ష.

**కార్మికులు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులతో చర్చించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.**

**వరంగల్ జిల్లా ఉదయం ప్రతినిధి అక్టోబర్ 24.**



కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో కార్మికులు, పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. పార్క్‌లో కార్మికులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్, ఆర్టీసీ డీఎం ధరమ్ సింగ్, జోనల్ మేనేజర్ స్వామి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బహుజన ఆత్మగౌరవ ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**హనుమకొండ కాకతీయ గౌడ హాస్టల్‌లో ఘనంగా విగ్రహావిష్కరణ పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి: కత్తి వెంకటస్వామి గౌడ్**

**హనుమకొండ, అక్టోబర్ 24 (ఉదయం ప్రతినిధి) :**



బహుజనుల ఆత్మగౌరవం, సమానత్వం కోసం పోరాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ కన్వీనర్ కత్తి వెంకటస్వామి గౌడ్ పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధి కోసం బహుజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. హనుమకొండ హంటర్ రోడ్ లోని గౌడ హాస్టల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కత్తి వెంకటస్వామి గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పాపన్న గౌడ్ సేవలను స్మరించుకున్నారు.

బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాటం

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్రను స్మరించుకుంటూ, ఆయన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బహుజన వర్గాల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక పురోగతి కోసం ఆయన చేసిన పోరాటాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. పాపన్న గౌడ్ జీవిత చరిత్రను యువత తెలుసుకోవడంతో పాటు, ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజంలో ఐక్యత, సమానత్వం, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

కాకతీయ గౌడ హాస్టల్‌లో పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా ఆయన చరిత్ర, పోరాట స్ఫూర్తిని భావితరాలకు పరిచయం చేసే అవకాశం కలిగిందని నిర్వాహకులు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు, యువకులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు అనంతుల రమేష్ గౌడ్, జూలూరి రంజిత్ గౌడ్, మార్క రవి గౌడ్, కూనూరు రంజిత్ గౌడ్, డాక్టర్ సోల్తి కిరణ్ గౌడ్, మాచర్ల శరత్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పులి శ్రీనివాస్ గౌడ్, జనార్దన్ గౌడ్, మోహన్ గౌడ్, బొనగాని యాదగిరి గౌడ్, బైరి రవికృష్ణ గౌడ్, తీగల జీవన్ గౌడ్, స్వామి గౌడ్, అశోక్ గౌడ్, పెరుమాండ్ల వెంకట్ గౌడ్, టీవీ రాజ్ గౌడ్ యుగేందర్ గౌడ్, హరీష్ గౌడ్, జగన్ గౌడ్, మార్క విజయ్ కుమార్ గౌడ్, సంజయ్ గౌడ్, సోల్తి సారయ్య గౌడ్, ఏకాంతం గౌడ్, గోపి గౌడ్, రాంకీ గౌడ్, సాగర్ గౌడ్, విజయ్ గౌడ్, కుమార్ గౌడ్, తేజ, ప్రజాప్రతినిధులు, యువకులు, హాజరయ్యారు.

# బీసీ సంక్షేమ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

**కులవృత్తిదారులకు 100 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలి.**
**సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు బీఆర్ఎస్ నేత బత్తిని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.**

**వరంగల్ జిల్లా ఉదయం ప్రతినిధి అక్టోబర్ 2**



తెలంగాణ రాష్ట్రంలో బీసీ సంక్షేమం కోసం గత మూడేళ్లలో బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఏ మేరకు ఖర్చు చేశారు, బీసీలకు అందించిన ఆర్థిక ప్రయోజనాలేమిటో ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ మార్కెట్ చైర్మన్, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమానికి సంబంధించిన నిధుల ఖర్చుపై ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.9,200 కోట్లు, 2025లో రూ.11,405 కోట్లు, 2026లో రూ.12,511 కోట్లు కేటాయించినట్లు ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మూడు సంవత్సరాలకు సంబంధించి మొత్తం రూ.33,116 కోట్ల కేటాయింపులపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. బీసీ కులాల కార్పొరేషన్ల ద్వారా ఆర్థిక చేయూత ఏది? రాష్ట్రంలో రజక, నాయీ బ్రాహ్మణ, ఉప్పర, వాల్మీకి బోయ, కృష్ణబలిజ, పూసల, బట్రాజు, కుమ్మరి, శాలివాహన, విశ్వబ్రాహ్మణ, మేదరి, గీత కార్మికులు, పద్మశాలి, వడ్డెర, ముదిరాజ్, యాదవ తదితర బీసీ కులాల సంక్షేమం కోసం వివిధ సొసైటీలు, ఫెడరేషన్లు, కార్పొరేషన్లు ఉన్నాయని తెలిపారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కూడా ఉందని పేర్కొన్నారు. ఆయా సంస్థల ద్వారా మంజూరైన నిధులు, లబ్ధిదారుల వివరాలు, అమలు చేసిన పథకాలపై ప్రభుత్వం సమగ్ర నివేదిక విడుదల చేయాలని కోరారు. కులవృత్తులకు 100 శాతం సబ్సిడీ ఇవ్వాలి. ప్రతి బీసీ కులానికి చెందిన కులవృత్తిదారులు తమ వృత్తులను అభివృద్ధి చేసుకునేందుకు 100 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని బత్తిని శ్రీనివాస్ గౌడ్ కోరారు. నిరుద్యోగ యువతీ యువకులు తమ నైపుణ్యాలకు అనుగుణంగా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు యంత్రాలు, వాహనాలు, అవసరమైన పరికరాలను సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, బీసీ కులాలకు చెందిన కార్మికులకు ఉచిత వైద్య, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటయ్యే సొసైటీలకు పరిశ్రమల స్థాపన కోసం స్థలాలు కేటాయించి, 100 శాతం బీసీల ఆర్థిక అభివృద్ధికి బీసీ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ), గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ, టెక్స్‌టైల్ కార్పొరేషన్, మహిళా సహకార అభివృద్ధి సంస్థల ద్వారా కూడా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు వాటా కల్పించాలి. తెలంగాణలో బీసీల జనాభా, వివిధ రంగాల్లో వారి ప్రాతినిధ్యంపై సమగ్ర వివరాలను వెల్లడించాలని ఆయన కోరారు. రాజకీయాలు, చట్టసభలు, ప్రభుత్వ ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయమైన వాటా కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న గౌడ్ పేరు అధికారికంగా ప్రకటించే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ బీసీల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి, కులవృత్తిదారులు, నిరుద్యోగులు, మహిళలు, విద్యార్థుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని బత్తిని శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

**గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలి.**
**సీఎస్ సంజయ్ జాజు**
**ఆసుపత్రుల నమోదు.**
**ఈ-డీఏఆర్ పోర్టల్‌లో ప్రమాద కేసుల వివరాలు తప్పనిసరి**

**వరంగల్ జిల్లా ఉదయం ప్రతినిధి అక్టోబర్ 24.**



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు గోల్డెన్ అవర్‌లో సత్వర వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం కింద అర్హులైన బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి పీఎం రాహత్ పథకం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ ఎన్. కిషోర్ కుమార్, డీఆర్వో విజయలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని తెలిపారు. చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా ప్రాణాలు కాపాడటానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకం అమలుకు జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయడంతోపాటు, ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈడీఏఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. సాంకేతిక ప్రక్రియల్లో జాప్యం కారణంగా బాధితులకు వైద్య సేవలు అందడంలో ఇబ్బందులు తలెత్తకూడదన్నారు. అలాగే జిల్లాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, చికిత్స పొందుతున్న బాధితులు, పెండింగ్ క్లెయిమ్‌లు, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ బాధితులకు చికిత్స పూర్తయ్యే వరకు అవసరమైన వైద్య సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు. పీఎం రాహత్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్స్‌ట్‌జెన్ ఎంపరివాహన్ మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌అండ్‌బీ ఈఈ రాజేందర్, ఆర్టీఓ అధికారి రంగారావు, జీడబ్ల్యూఎంసీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బాక్సింగ్‌లో హసన్‌పర్తి విద్యార్థుల సత్తా

**రాష్ట్రస్థాయి పోటీలకు ఏడుగురి ఎంపిక క్రీడాకారులను అభినందించిన గొర్రె కిరణ్ కుమార్**

**హసన్‌పర్తి అక్టోబర్ 24 (ఉదయం ప్రతినిధి):**

క్రీడారంగంలో హసన్‌పర్తి ప్రాంత విద్యార్థులు తమ ప్రతిభను చాటు కుంటున్నారు.ఇటీవల నిర్వహించిన 70వ రాష్ట్రస్థాయి అండర్ 17 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హసన్‌పర్తి ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం హర్షణీయమని 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్ అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో ఎస్. తనుశ్రీ (ఎస్ఆర్ కాలేజీ), ఎస్. లాస్య (మాంటిస్సోరి), బి. వైష్ణవి,పి. వరుణ్,బి. అభినవ్ (జెడ్పీహెచ్ఎస్ హసన్‌పర్తి), జి.విశ్వ తేజ, ఎస్.అమృత్‌రాజ్ (సెయింట్ మేరీస్) ఉన్నారు. వీరు బోడుప్పల్‌లో డీవీఆర్ అకాడమీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను 66వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ

అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్, మాజీ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి తదితరులు అభినందిస్తూ క్రీడాకారులకు శిక్షణ అందించిన కోచ్ ఎస్. నరేందర్ దేవ్,పీడీ ఎస్. పార్థసారథిని ప్రశంసించారు.

# బాధిత ఎస్సీ, ఎస్టీలకు పరిహారం త్వరగా అందించాలి అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, అక్టోబర్ 24 (ఉదయం జిల్లా ప్రతినిధి) :**



బాధిత ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని త్వరగా అందించేలా అధికారులు చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశించారు.

శనివారం జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం'లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, భూ సమస్యలు, బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై ఆర్డీవోలు, పోలీస్, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. విజిలెన్స్ కమిటీలో తీర్మానించిన ప్రతిపాదనలను సంబంధిత శాఖలు త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల 30వ తేదీన తప్పనిసరిగా 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే, ప్రతి మూడు నెలలకోసారి జరిగే ఈ కమిటీ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు, పుట్ట రవి, చుంచు రాజేందర్, సింగారపు రవి ప్రసాద్, రడపాక పరంజ్యోతి, నూనవత్ జవహర్ లాల్, ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, ఆర్డీవోలు, ఏసీపీలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి గూగులోతును కలిసిన నేతలు

**ఖానాపురం, అక్టోబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



వరంగల్, నలగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్ ను బిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వం కలిసి శాలువా కప్పి పూల బొకేను అందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు మునిగాల వెంకటరెడ్డి, మునిగాల నరసింహారెడ్డి, మండల శ్రీనివాస్, తీగల యాదగిరిరావు, తక్కలపల్లి బాబురావు, ఎస్.కె మౌలానా, ఇరుకు దేవేందర్ రావు, కాస ప్రవీణ్ , మల్కాపురి ప్రభాకర్, రామగిరి రాజేష్, మేకల కుమార్, రామగిరి సురేందర్, బూడిద శ్రీనివాస్, వెన్ను సమ్మయ్య, ఊడుగుల రాజుయాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య

**ధర్మసాగర్, అక్టోబర్ 24 ( ఉదయం ప్రతినిధి) :**



ధర్మసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముప్పారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ అప్పయ్య శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, రికార్డులు, రిజిస్టర్లు, ఆరోగ్య కార్యక్రమాల తీరును పరిశీలించారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ఎం (NHM) ఉద్యోగులు సమ్మెలో ఉన్నప్పటికీ, ప్రజలకు వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక వైద్యం, మాతా శిశు సంరక్షణ సేవలు నిరంతరాయంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోగులు ఇబ్బంది పడకుండా చూసే బాధ్యత అధికారులపై ఉందని డాక్టర్ అప్పయ్య స్పష్టం చేశారు.

# భూ రీసర్వేపై అధికారులకు క్షేత్రస్థాయి శిక్షణ




**రోవర్‌తో ప్రత్యక్షంగా రీసర్వే ప్రక్రియపై అవగాహన.**

**వరంగల్ జిల్లా ఉదయం ప్రతినిధి అక్టోబర్ 24.**

భూ రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు శనివారం వరంగల్ కలెక్టరేట్ ప్రాంగణంలో క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్, ఏ.డీ. సర్వే రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ, ఉమారాణి ఆధ్వర్యంలో రోవర్ పరికరంతో భూ రీసర్వే నిర్వహించే విధానంపై అధికారులకు ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా భూ రీసర్వేకు సంబంధించిన విధివిధానాలు, సాంకేతిక అంశాలు, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. రోవర్ పరికరాన్ని ఉపయోగించి భూముల రీసర్వేను ఎలా చేపట్టాలి, సర్వే ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనే అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లకు అవగాహన కల్పించారు. భూ రీసర్వే పనులను కచ్చితత్వంతో, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికారులు ఈ శిక్షణ ద్వారా పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి



**లక్నవరం, జయగిరి గ్రామాల్లో సర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్**

**హసన్ పర్తి అక్టోబర్24 (ఉదయం ప్రతినిధి):**

హసన్ పర్తి మండలంలోని లక్నవరం, జయగిరి గ్రామాల్లో కొనసాగుతున్న భూ సర్వే పనులను అదనపు కలెక్టర్ రవి, హసన్ పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో సర్వే పనుల పురోగతిని తనిఖీ చేసి, సర్వే నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ... భూ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని, భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, సర్వే ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, భూములకు సంబంధించిన వివరాల పై స్పష్టతతో పని పూర్తి చేయాలని అన్నారు. సర్వే పనులను నిర్ణీత పద్ధతిలో నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు .ఈ కార్యక్రమంలో సర్వేయర్ సుజత, జీపీఓ వనిత, సర్వేయర్లు, రైతులుతదితరులు పాల్గొన్నారు.

# అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించి.. భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి

- రెవెన్యూ అటవీ శాఖల సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ
- రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి రీ సర్వే చేపట్టాలి
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)



అటవీ సరిహద్దు వివాదాలను పరిష్కరించి భూముల రీ సర్వే పనులను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఆదేశించారు రెవెన్యూ అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ క్షేత్ర స్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు శనివారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే పురోగతి బృందాల ఏర్పాటు అటవీ సరిహద్దు వివాదాలు తదితర అంశాలపై సమీక్షించారు ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జగిత్యాల సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ హాజరయ్యారు ఈ సందర్భంగా భూ పరిపాలన ప్రధాన కమిషనర్ రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు అటవీ సరిహద్దు వివాదాలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు రీ సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు సమాచారం అందించాలని తెలిపారు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులకు కూడా వారి భూముల్లో సర్వే నిర్వహించే తేదీలను ముందుగానే తెలియజేసి వారు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు రీ సర్వే సందర్భంగా క్షేత్ర స్థాయి రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు రీ సర్వే పనులకు అవసరమైన అదనపు రోవర్ పరికరాలను ప్రభుత్వం తగిన సంఖ్యలో సమకూరుస్తుందని తెలిపారు భూ భారతి తరహాలో రీ సర్వే కోసం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు సిబ్బంది పరికరాలను సమర్థంగా వినియోగించుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ సర్వే భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కలెక్టరేట్ ఏవో కిషన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేకు వేగం పెంచండి

- ఎంపిక చేసిన గ్రామాల్లో తొలి దశ పనులు త్వరగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 24 (వుదయం ప్రతినిధి) :



భూ రీసర్వే పనులను వేగవంతం చేసి, తొలి దశలో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ ఆదేశించారు. అవసరమైన సిబ్బంది, యంత్ర పరికరాలు, సాంకేతిక సదుపాయాలను సమకూర్చుకొని నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు.భూ రీసర్వే పురోగతిపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్ పాల్గొన్నారు.ప్రతి జిల్లాలో తొలి దశ భూ రీసర్వే కోసం 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్లు లోకేశ్‌కుమార్ తెలిపారు. సర్వేకు పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు. భూ సరిహద్దుల వివాదాలు, భూ రికార్డుల్లో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని పేర్కొన్నారు, రీసర్వేకు అవసరమైన యంత్ర పరికరాలు, సాంకేతిక వనరులు, మౌలిక సదుపాయాలను ముందుగానే సమకూర్చుకోవాలని కార్యదర్శి సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తూ భూములకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందికి అవసరమైన సూచనలు ఇవ్వాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో భూ రీసర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ ప్రక్రియపై అటవీ, నీటిపారుదల, రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చినట్లు వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు శ్రీధర్‌బాబు, కేఎస్‌బీ కుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# 45 రోజుల్లో రైస్ మిల్లుల బకాయిలు చెల్లించాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు
- బకాయిలు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం ఆస్తుల జప్తు
- బకాయిలు చెల్లించిన మిల్లర్లకే వచ్చే సీజన్‌లో బియ్యం కేటాయింపులు

పెద్దపల్లి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)




రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను 45 రోజుల్లోగా 100 శాతం చెల్లించాలని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శశిధర్ రాజుతో కలిసి 15 మంది డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో ఆయన బకాయిల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు మాట్లాడుతూ, ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో నంబర్ 17 ప్రకారం రైస్ మిల్లర్లకు పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు 45 రోజుల గడువు ఇచ్చినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా బకాయిలను నగదు రూపంలో చెల్లించాలని లేదా బకాయిలకు సమానమైన బియ్యాన్ని ప్రభుత్వానికి అందజేయాలని స్పష్టం చేశారు.

5 రోజుల గడువులోగా బకాయిలను పూర్తిగా చెల్లించని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత మిల్లర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. బకాయిల వసూళ్లలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదే విధంగా, రాబోయే సీజన్‌లో డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు బియ్యం కేటాయింపులు జరగాలంటే ముందుగా వారు తమ పెండింగ్ బకాయిలను పూర్తిగా చెల్లించాలని తెలిపారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించి, తదుపరి సీజన్‌లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో ఓఎస్డీ శ్రీధర్ రెడ్డి , జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్ రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఉప సర్పంచ్ మధు కుటుంబ సభ్యులను పరామర్శించిన బీజేపీ నేతలు

కోరుట్ల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)

భారతీయ జనతా పార్టీ నాయకులు కథలాపూర్ మండలం కలికోట గ్రామ ఉప సర్పంచ్ బొమ్మ మధు తండ్రి కి ఇటీవల బైక్ ఆక్సిడెంట్ అయ్యి తీవ్ర గాయాలు అవ్వడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించిన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్లా జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వ రావు ఎస్టి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రాంసింగ్ లు పాల్గొన్నారు.

# పల్లె పాలనకు శాపంగా సిబ్బంది కొరత

పెద్దపల్లి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)



పల్లెల అభివృద్ధి మాటలు ఘనంగా వినిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల కొరత ప్రజలకు సమస్యగా మారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాల్సిన యంత్రాంగంలో ఖాళీలు ఉంటే.. సమస్యలు పరిష్కరించేది ఎవరు? రైతుల ఇబ్బందులు పట్టించుకునేది ఎవరు? గ్రామాల అభివృద్ధిని పర్యవేక్షించేది ఎవరు? పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గ్రామ పాలన అధికారుల కొరతపై ప్రజల్లో ఈ ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఒకే అధికారి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడితే.. అన్ని గ్రామాలకు సమర్థవంతమైన సేవలు ఎలా అందుతాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఒకరిపై మూడు గ్రామాల భారం.. ప్రజలకు తప్పని నిరీక్షణ**

గ్రామాల్లో పారిశుద్ధ్యం, వార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, వ్యవసాయ సంబంధిత సమస్యలు సహా అనేక అంశాల్లో అధికారుల పర్యవేక్షణ అవసరం. అయితే సిబ్బంది కొరత కారణంగా అధికారులు పలు గ్రామాల మధ్య విధులు నిర్వహించాల్సి వస్తోందని తెలుస్తోంది. దీంతో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పాలనా వ్యవస్థలోనే సిబ్బంది కొరత ఉంటే సామాన్యుల గోడు వినేదెవరనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కాల్వ శ్రీరాంపూర్ మండలంలో జీపీఓ క్లస్టర్ విధానంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా, ప్రస్తుతం 11 మంది గ్రామ పాలన అధికారులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కలే సిబ్బంది కొరత తీవ్రతను సూచిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఒక్కో అధికారి రెండు, మూడు గ్రామాల బాధ్యతలు చూసుకోవాల్సి వస్తే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణకు ఎంత సమయం కేటాయించగలరన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే ఖాళీ పోస్టులపై అధికారిక గణాంకాలు, మండలాలవారీ వివరాలు వెల్లడిస్తే సమస్య తీవ్రతపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**ప్రభుత్వ ప్రకటనలు ఒకవైపు.. క్షేత్రస్థాయి పరిస్థితులు మరోవైపు.**

గ్రామీణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత. ఆ లక్ష్యాలను సాధించాలంటే గ్రామస్థాయిలో తగినంత సిబ్బంది ఉండటం అత్యవసరం. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా, ఉన్న సిబ్బందిపైనే అదనపు బాధ్యతలు మోపితే పాలనా సామర్థ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను సమీక్షించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా గ్రామ పాలన అధికారుల కొరతపై సమగ్ర పరిశీలన చేపట్టి, ఖాళీ పోస్టుల వివరాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట తగిన సిబ్బందిని నియమించి, ప్రతి గ్రామానికి ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పల్లెల అభివృద్ధి కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు కనిపించాలని, గ్రామ పాలనలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆహార భద్రతకు తూట్లు.. కిరాణా దుకాణాల్లో అక్రమాలు

- గ్రామాల్లో గడువు ముగిసిన వస్తువుల విక్రయంపై ఆరోపణలు
- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం
- మూడు పువ్వులు ఆరు కాయలుగా కిరాణా దందా
- పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు

ముత్తారం అక్టోబర్ 24(వుదయం ప్రతినిధి):



గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.మండలంలోని పలు గ్రామాల్లో కొన్ని కిరాణా దుకాణాల్లో గడువు ముగిసిన ఆహార పదార్థాలు,నాణ్యత లేని వస్తువులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న వస్తువుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన వ్యాపారులు లాభార్జనే లక్ష్యంగా నిబంధనలను పక్కన పెట్టి వ్యాపారం నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామాల్లోని కిరాణా దుకాణాలు ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించే ప్రధాన కేంద్రాలుగా ఉంటాయి.అయితే కొన్ని దుకాణాల్లో ఆహార భద్రతా ప్రమాణాలను పట్టించుకోకుండా కాలం చెల్లిన చాక్లెట్లు,బిస్కెట్లు, కూల్‌డ్రింక్స్,ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు,చిరుతిళ్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.వస్తువులపై ముద్రించిన తయారీ,గడువు తేదీలను పరిశీలించకుండా విక్రయించడం వల్ల వినియోగదారులు మోసపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ముఖ్యంగా చిన్నారులే ఈ పరిస్థితుల వల్ల ఎక్కువగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది.పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,గ్రామాల్లోని చిన్నపిల్లలు రోజూ కిరాణా దుకాణాల నుంచి చాక్లెట్లు,బిస్కెట్లు,ఐస్‌క్రీమ్‌లు,పానీయాలు కొనుగోలు చేస్తుంటారు.వీటిలో గడువు ముగిసిన లేదా నాణ్యతలేని ఆహార పదార్థాలు ఉంటే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.కడుపు నొప్పి,వాంతులు, విరేచనాలు,ఆహార విషబాధ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారుల్లో అవగాహన కొరవడటం కూడా కొందరు వ్యాపారులకు అనుకూలంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో వస్తువుల గడువు తేదీలను పరిశీలించి కొనుగోలు చేసే అలవాటు కొంతమందిలో ఉన్నప్పటికీ,గ్రామాల్లో చాలామంది వినియోగదారులు దానిపై పెద్దగా దృష్టి సారించడం లేదని అంటున్నారు.

దీనిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కాలం చెల్లిన వస్తువులను విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ముత్తారం మండలంలోని పలు గ్రామాల్లో కిరాణా దుకాణాల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు.నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు,గడువు ముగిసిన వస్తువులు,సరైన బిల్లులు లేకుండా జరుగుతున్న అమ్మకాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.ఆహార భద్రతా శాఖ,పౌర సరఫరాల శాఖ,వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఆహార భద్రత ప్రజల ప్రాథమిక హక్కు అని, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అంశాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించే ప్రతి ఆహార పదార్థం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చర్యలు తీసుకుంటేనే ప్రజారోగ్యానికి రక్షణ కలుగుతుందని అభిప్రాయపడుతున్నారు.

# బాధిత ప్రజలకు అండగా నిలుస్తాం

**మానవ హక్కుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విజయసాగర్**

పెద్దపల్లి,అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)



వినియోగదారుల మరియు మానవ హక్కుల పరిరక్షణ,ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ప్రతిష్టాత్మక సంస్థ ఉపభోక్త ఏవం మానవ అధికార్ రక్షా సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లపెల్లి విజయసాగర్ నియమితులయ్యారు.ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షులు ఆర్.కె. జైన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహారా బాను సూచనలు,సలహాల మేరకు జాతీయ నాయకత్వం ఈ నియామకాన్ని ఖరారు చేసింది.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లపెల్లి విజయసాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వ,పోలీస్ లేదా ఇతర అధికార యంత్రాంగం సకాలంలో స్పందించని పక్షంలో సంస్థ తరపున బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.ప్రజల గోడును,సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కులు,మానవ హక్కులపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని,బాధితులకు న్యాయం జరిగేలా సంస్థ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# ధర్యాపూర్ మోడల్ స్కూల్‌లో యూఎన్‌ఓ దినోత్సవం

ముత్తారం , అక్టోబర్ 24(వుదయం ప్రతినిధి):



ముత్తారం మండలం ధర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో యూఎన్ఓ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు.గాంధీ స్మారక నిధి తెలంగాణ,నేషనల్ యూత్ ప్రాజెక్ట్, నిఫా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ యూత్ ప్రాజెక్ట్ రాష్ట్ర సమన్వయకర్త యాదవరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాంతి, సౌభ్రాతృత్వం,మానవతా విలువలను అలవర్చుకొని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు.ప్రపంచ శాంతి, అంతర్జాతీయ సహకారంలో ఐక్యరాజ్యసమితి పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసరి సంతోష్‌కుమార్,ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎన్‌ఎంఎంఎస్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ముత్తారం అక్టోబర్ 24(వుదయం ప్రతినిధి):

ముత్తారం మండలం దరియాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ పరీక్షల సన్నద్ధత కోసం ప్రత్యేకంగా రూపొందించిన షార్ట్‌టర్మ్ ప్రిపరేషన్ మెటీరియల్‌ను మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం,గ్రామ సర్పంచ్ రాపల్లి రాజయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తక్కువ సమయంలో పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధమయ్యేందుకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయని తెలిపారు.విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించి స్కాలర్‌షిప్ పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్ కుమార్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల ఆన్‌లైన్ నమోదు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి
- రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలి

జగిత్యాల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)




రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం-2025 కింద పీఎం రాహత్ పథకం అమలు పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ జగిత్యాల జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు పీఎం రాహత్ పథకం అమలు విధానం ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ ప్రమాద వివరాల నమోదు క్లెయిమ్‌ల ఆమోదం నిధుల విడుదల తదితర అంశాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు

**రోడ్డు ప్రమాద ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలి**

ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు బాధితులకు అందుతున్న వైద్య సేవలు పెండింగ్ కేసులు క్లెయిమ్‌ల ఆమోదం ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి ఈ-డీఏఆర్ పీఎం రాహత్ పోర్టళ్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు ఆరోగ్య పోలీసు శాఖలు సమన్వయంతో పని చేస్తూ బాధితులకు చికిత్స పూర్తికాకముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్స్ట్ జెన్ ఎం-పరివాహన్ (నెక్స్ట్ జన్ ఎం పరివాహన్) మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు

**ప్రతి ప్రమాద కేసును పీఎం రాహత్ పథకం కింద నమోదు చేయాలి : జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని తక్షణమే అమలులోకి తీసుకువచ్చి ప్రమాద కేసులను ఈ పథకం కింద నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు జిల్లాలో జరిగే ప్రతి రోడ్డు ప్రమాద కేసును నమోదు చేసి అర్హులైన బాధితులకు పథకం ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు జిల్లాలోని ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి పీఎం రాహత్ పథకంలో వెంటనే నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల పూర్తి వివరాలను సేకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) వివరాలతో మ్యాపింగ్ చేయాలని సూచించారు ఆసుపత్రులు సంబంధిత పోలీసు అధికారుల మధ్య నిరంతర సంప్రదింపులు ఉండేలా చూడాలని ప్రమాదం జరిగిన వెంటనే కేసు వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయంతో పని చేస్తూ అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల నమోదు పోలీస్ స్టేషన్ అధికారుల వివరాల మ్యాపింగ్ ప్రమాద కేసుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు ప్రతి రోడ్డు ప్రమాద కేసుకు సంబంధించి ఆసుపత్రి పోలీసు శాఖలు వెంటనే స్పందించి అవసరమైన వివరాలను నమోదు చేయడంతో పాటు ధ్రువీకరణలు ఆమోదాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించేలా పోలీసు వైద్య రవాణా రహదారులు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు పీఎం రాహత్ పథకం కింద నమోదైన కేసులు బాధితులకు అందించిన చికిత్స పెండింగ్ ఆమోదాలు ఆసుపత్రులకు చెల్లించాల్సిన నిధులపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు అర్హులైన ప్రతి ప్రమాద బాధితుడికి పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని ఆసుపత్రుల నమోదు లేదా పరిపాలనా ప్రక్రియల కారణంగా అత్యవసర వైద్య చికిత్సలో ఎలాంటి జాప్యం జరగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత ఆర్ అండ్ బీ ఈఈ జిల్లా రవాణా అధికారి సందాని సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్
- వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్

జగిత్యాల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)



జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం డాక్టర్ సంజయ్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ జగిత్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు ఇప్పటివరకు పూర్తయిన పనులు ఇంకా పూర్తి చేయాల్సిన పనుల వివరాలను సమీక్షించారు ఈ సందర్భంగా కలెక్టర్ ఎమ్మెల్యే వైద్య కళాశాల భవనంతో పాటు హాస్టల్ బ్లాక్ కిచెన్ తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి వాటి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేలా నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు పనుల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు హాస్టల్ బ్లాక్ కిచెన్ తరగతి గదులతో పాటు కళాశాలకు సంబంధించిన అన్ని నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ప్రభుత్వ వైద్య కళాశాల అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో వైద్య విద్య అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి అవసరమైన అన్ని వసతులతో కళాశాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారుఅనంతరం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు కావడం ప్రజలకు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు వైద్య కళాశాల అందుబాటులోకి వస్తే జిల్లాలోని విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేందుకు మెరుగైన అవకాశాలు లభించడంతో పాటు ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువవుతాయని పేర్కొన్నారు వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు భవన నిర్మాణ పనులతో పాటు విద్యార్థులకు అవసరమైన హాస్టల్ కిచెన్ తరగతి గదులు తదితర మౌలిక వసతులను నాణ్యతతో ఏర్పాటు చేయాలని తెలిపారు నిర్మాణ పనుల విషయంలో ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయంతో పరిష్కరించుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు ప్రభుత్వ వైద్య కళాశాల త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత శాఖల అధికారులు వైద్య కళాశాల నిర్మాణ పనులకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.



# పోలీసు అధికారులు సిబ్బందికి వ్యాసరచన పోటీలు

జగిత్యాల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సుపరేండెంట్ అఫ్ పోలీస్ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసు అధికారులు సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు పోలీసు సిబ్బందిలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడం సామాజిక బాధ్యతను గుర్తు చేయడం ప్రజాసేవ పట్ల నిబద్ధతను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడం ఈ పోటీల ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహించారు మొదటి విభాగంలో భాగంగా పోలీస్ కానిస్టేబుల్ నుంచి అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) హోదా వరకు ఉన్న సివిల్ ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందికి కింది అంశాలను కేటాయించారు . ఈ వ్యాసరచన పోటీల ద్వారా పోలీసు అధికారులు సిబ్బంది తమ ఆలోచనలు అనుభవాలు విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అనుసరించాల్సిన విధానాలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచే అవకాశం కల్పించారు.

# నేడే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులకు భూమి పూజ

- మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- స్థానిక నాయకులతో భూమిపూజ స్థల పరిశీలన
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్



**జగిత్యాల అక్టోబర్ 24 (వుదయం)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేయగా జగిత్యాల నియోజకవర్గం లోని తాటిపల్లి మొరపల్లి శివారులో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ను మంత్రుల చేతుల మీదుగా భూమిపూజ సందర్భంగా భూమిపూజ మీటింగ్ స్థలాన్ని అధికారులు స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించిన జగిత్యాల నియోజక వర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ పేద కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు వసతి భోజనం క్రీడలు నైపుణ్యాభివృద్ధి వంటి సౌకర్యాలను ఒకే ప్రాంగణంలో అందించడం ముఖ్య ఉద్దేశం అని అన్నారు 2500 మంది విద్యార్థులకు 500 మంది స్టాఫ్ కు ఆధునిక విద్యా సదుపాయాలు ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య హాస్టల్ భోజనం వసతి సౌకర్యాలు క్రీడా ప్రాంగణం మీటింగ్ హాల్ ప్రభుత్వం కల్పించ బోతుందన్నారు

తెలంగాణ రాష్ట్రంలో విద్య వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చలిగల్ లో సహజ వ్యవసాయం కు స్థలం కేటాయించడంతో తాటిపల్లి మొరపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు గత ప్రభుత్వంలో వాళంతరి నిర్వీర్యం అయిందని గతంలో వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ కేంద్రంలో ఉన్నత అధికారులకు శిక్షణ ఇచ్చిన విషయం అందరికీ తెలుసని అన్నారు కేంద్రీయ విద్యాలయానికి 5 ఎకరాలు కేటాయింపు చేయటం జరిగింది నేడు ఆదివారం మంత్రులు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ల చేతుల మీదుగా భూమి పూజ ఉంది

**ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్**

జగిత్యాల కు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ కి జగిత్యాల ప్రజల పక్షాన ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు ఇట్టి భూమి కార్యక్రమానికి ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రజాప్రతినిధులు నాయకులు అందరూ హాజరు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి పాక్స్ చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు మాజీ జడ్పీటీసీ పెండెం రాములు సర్పంచులు కట్ట రాజేందర్ బొలిశెట్టి గంగారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్బూరి మల్లేశం గౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ నక్కల రవీందర్ రెడ్డి సీనియర్ నాయకులు సమీండ్ల శ్రీనివాస్ అడువాల లక్ష్మణ్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ దుమాల రాజ్ కుమార్ అసెంబ్లీ యూత్ అధ్యక్షులు భూమా రెడ్డి సేవాదళ్ సెక్రటరీ ముకేష్ ఖన్నా మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం గంగారెడ్డి పాక్స్ డైరెక్టర్ నీరటి గంగారెడ్డి, నలువాల సురేష్ దాసరి సతీష్ నరేష్ మాజీ సర్పంచ్ లు గంగారం నారాయణ కొప్పు మహేష్ సదానందం మనోజ్ లక్ష్మణ్ శ్యాం శేఖర్ అధికారులు శశి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలి

- సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్
- మొదటి దశలో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి
- అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసి సర్వే పనుల్లో వేగం పెంచాలి
- క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- సర్వేకు అవసరమైన యంత్ర పరికరాలు, సాంకేతిక సదుపాయాలను సమకూర్చుకోవాలి
- గ్రామాల వారీగా పురోగతిని పర్యవేక్షిస్తూ పారదర్శకంగా భూ రీసర్వే పూర్తి చేయాలి



**పెద్దపల్లి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)**

భూ రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి, ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూ రీసర్వే పనుల పురోగతిపై సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీరాములు తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూ రీసర్వే మొదటి దశలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో సర్వే పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సర్వే పనులకు అవసరమైన ప్రణాళిక రూపొందించుకొని, క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. భూ రీసర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన సిబ్బంది, సాంకేతిక వనరులు, యంత్ర పరికరాలను సమకూర్చుకొని నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

మొదటి దశలో ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సీసీఎల్ఏ కమిషనర్ సూచించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకుంటూ, పనుల పురోగతికి అనుగుణంగా అదనపు సిబ్బందిని కేటాయించాలని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం అందించి పనులు సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సర్వే లక్ష్యాలను నిర్దేశించుకొని, ప్రతిరోజూ చేపట్టిన పనులు, మిగిలి ఉన్న పనుల వివరాలను సమీక్షించాలని సూచించారు. సర్వే పనుల్లో వెనుకబడిన గ్రామాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక దృష్టి సారించి పనుల వేగం పెంచాలని తెలిపారు. సిబ్బంది కొరత లేదా ఇతర కారణాలతో పనులు నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

భూ రీసర్వే సమయంలో ఎదురయ్యే స్థానిక సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశించారు. భూ సరిహద్దులకు సంబంధించిన సమస్యలు, భూ రికార్డుల్లో వ్యత్యాసాలు, ఇతర సాంకేతిక ఇబ్బందులను పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణకు ఆటంకాలు ఏర్పడకుండా రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అవసరమైన చోట సంబంధిత భూయజమానులకు సర్వే ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, సమస్యలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. సమస్యలు పెండింగ్‌లో ఉంచకుండా వాటి పరిష్కారానికి నిర్దిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

భూ రీసర్వే ప్రక్రియ ద్వారా భూములకు సంబంధించిన వివరాలు కచ్చితంగా నమోదు చేసేందుకు, భూ రికార్డుల్లో పారదర్శకత పెంపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని జిల్లాల్లో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏడి సర్వేయర్ సోమేశ్వర్, సంబంధిత రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- పీఎం రాహత్ పథకం ద్వారా రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స
- పథకం అమలుకు అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా నమోదు కావాలి
- ఈ-డీఏఆర్ పోర్టల్‌లో ప్రతి ప్రమాద కేసు నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి
- ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి, సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వివరాలను మ్యాపింగ్ చేయాలి
- పీఎం రాహత్ పథకం సమర్థవంతమైన అమలుతో ఏటా రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధుల ఆదా



**పెద్దపల్లి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం–2025 కింద పీఎం రాహత్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి పాల్గొన్నారు. పఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు.

పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు.

పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ బాధ్యతల మార్పిడి జరిగినప్పుడు పోర్టల్‌లో సంబంధిత అధికారి వివరాలు, జిల్లా అధికారిక ఈ-మెయిల్, మొబైల్ నంబర్లను వెంటనే నవీకరించాలని తెలిపారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి రికార్డు.. ఒకే రోజులో 13,681 టన్నుల బొగ్గు డిస్పాచ్

**పెద్దపల్లి, (రామగుండం) అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)**




సింగరేణి కాలరీస్ సంస్థ, ఆర్జీ–1 ఏరియాలోని గోదావరిఖని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్–5 (ఓసీపీ–5) బొగ్గు రవాణాలో సరికొత్త రికార్డును నెలకొల్పింది. శుక్రవారం ఒకే రోజులో 9,666 టన్నుల బొగ్గు రవాణా లక్ష్యానికి గాను, ఏకంగా 13,681 టన్నుల బొగ్గును డిస్పాచ్ చేసి నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించింది. లక్ష్యానికి మించి బొగ్గును రవాణా చేసి రికార్డు సాధించడం పట్ల ఆర్జీ–1 ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన గని అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, యూనియన్ ప్రతినిధులను, కాంట్రాక్ట్ ఉద్యోగులను శనివారం ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ఉత్పత్తి, రవాణా లక్ష్యాల సాధనలో సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ డి.రమేష్, ఎస్ఓఎం డి.రమేష్ బాబు, అదనపు మేనేజర్ గంధం రాములు, పిట్ సెక్రటరీ జి.ప్రభుదాస్‌తో పాటు గని సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి దోహదపడింది.

# టీజీపీఎస్సీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**



కరీంనగర్ నగరంలోని వివేకానంద డిగ్రీ కళాశాల, హుజూరాబాద్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో జరుగుతున్న అసిస్టెంట్ సైంటిస్ట్, అనలిస్ట్ గ్రేడ్–II ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రత కల్పించామని, అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 144 అమలు చేస్తూ, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించినట్లు వెల్లడించారు. సీసీ కెమెరాల నిఘా, బయోమెట్రిక్ విధానం, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో పోలీస్ అధికారులు, కేంద్రాల సమన్వయకర్తలు పాల్గొన్నారు.

# సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు

**కోరుట్ల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)**



కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము తిరుపతి ని మేడిపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ హోదాల నాయకులు శనివారం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించారు ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దం రాజేందర్ రెడ్డి మేడిపల్లి మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ యాదవ్ వల్లంపల్లి పాక్స్ చైర్మన్ ఏనుగు రమేష్ రెడ్డి మేడిపల్లి మండల పాక్స్ చైర్మన్ ఎడమల రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి నాగరాజు మచాపూర్ గ్రామ సర్పంచ్ రోజా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురికి నేడు పొన్నం ప్రభాకర్ రాక

**శ్రీలక్ష్మి నృసింహుని దర్శనం,**

**బస్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన**

**ధర్మపురి అక్టోబర్24(వుదయం ప్రతినిధి):**



ప్రాచీన పుణ్యక్షేత్రమైన ధర్మపురిలో మంత్రి పర్యటనకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర మంత్రులు పొన్నం.ప్రభాకర్, అడ్లూరి. లక్ష్మణ్‌కుమార్ ఆదివారం ధర్మపురిలో పర్యటించనున్నారు. మంత్రులు శనివారం రాత్రికి ధర్మపురికి చేరుకుని, అక్కడే రాత్రి బస చేయను న్నారు. ఆదివారం ఉదయం శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని మంత్రు లు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వ హించనున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం, ధర్మపురిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మంత్రుల పర్యట నను విజయ వంతం చేసేందుకు అధి కార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఎలాంటి అసౌక ర్యాలు కలగ కుండా కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తు, ప్రొటో కాల్ ఏర్పా ట్లపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.

# కోర్టు, పోలీసుల మధ్య అను సంధానం అత్యవసరం

**హైకోర్టు న్యాయమూర్తి నర్సింగరావు**

**ధర్మపురి అక్టోబర్24(వుదయం ప్రతినిధి):**



ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన హైకోర్టు న్యాయ మూర్తి నందికొండ నర్సింగరావును ధర్మపురి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసెక్యూటర్ బి.రాజేష్ మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా ఆయనకు పుష్పగు చ్ఛం అందజేసి స్వాగతం పలి కారు. ఈ సందర్భంగా న్యాయ మూర్తి నర్సింగరావు మాట్లాడు తూ కోర్టులకు, పోలీసు శాఖకు మధ్య అనుసంధానకర్తగా వ్యవ హరిస్తూ న్యాయ విచారణ ప్రక్రి య సజావుగా సాగేలా ఏపీపీలు మరింత బాధ్యతాయుతంగా, ఉన్నతమైన పాత్ర పోషించాల ని సూచించారు. ఈ కార్యక్రమం లో బుగ్గరం, వెల్గటూర్ ఎస్సై లు శ్రీకాంత్, ఉదయ్ కుమార్, కోర్టు సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

# ముత్తారం తహశీల్దార్‌గా అంజయ్య బదిలీ

**ముత్తారం, అక్టోబర్ 24 (ఉదయం ప్రతినిధి):**



ముత్తారం మండల తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ రెడ్డి మంథని ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మంథని ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అంజయ్య ముత్తారం మండల తహశీల్దార్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు జరిగిన బ దిలీల తో ముత్తారం మండలానికి కొత్త తహశీల్దార్‌గా అంజయ్య బాధ్యతలు చేపట్టనున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం

- పీఎం రాహత్ పథకంతో ప్రాణాలు కాపాడాలి
- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించడమే కీలకం
- జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచన

**రాజన్న సిరిసిల్ల, అక్టోబరు 24 (వుదయం ప్రతినిధి) :**



రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడేందుకు పీఎం రాహత్ పథకం దోహదపడుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన బాధితులకు పోలీసుల ఆమోదం పొందిన కేసుల్లో గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు చికిత్స అందించే అవకాశం ఉందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి, కీలకమైన గోల్డెన్ అవర్‌లో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం రాహత్ పథకం అమలుపై శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమావేశంలో పాల్గొన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు అత్యవసర చికిత్స, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మధ్య సమన్వయం, చికిత్స ఖర్చుల చెల్లింపులపై సమీక్షించారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటలో బాధితులకు వైద్యం అందించడం ప్రాణాలను కాపాడటంలో కీలకమని సీఎస్ పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు రహదారి భద్రత కమిటీలతో సమన్వయం చేసుకోవాలని, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారుల భాగస్వామ్యంతో పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని సూచించారు. ప్రమాదాల వివరాలను పారదర్శకంగా నమోదు చేసేందుకు టీఎంఎస్ 2.0 పోర్టల్‌ను వినియోగించుకోవాలని తెలిపారు, బాధితుల చికిత్స ఖర్చులను జనరల్ ఇన్సూరెన్స్ ద్వారా నేరుగా ఆసుపత్రులకు చెల్లించే విధానాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సంజయ్ జాజు ఆదేశించారు. అత్యవసర సేవలను 112, సీసీటీఎన్ఎస్ వ్యవస్థలతో అనుసంధానించి బాధితులకు వేగంగా సేవలందించాలని చెప్పారు. పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, జిల్లాల్లో అమలు తీరును కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాద సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలు అప్రమత్తమై బాధితులకు తక్షణ వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డాక్టర్ సంతోష్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, రవాణా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

**జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్**

**జగిత్యాల అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)**



జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం వరి ధాన్యం కొనుగోళ్ల నిర్వహణపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా సజావుగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లు నాణ్యత ప్రమాణాలు తూకం ధాన్యం రవాణా రైతులకు చెల్లింపులు తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు తూకం యంత్రాలు తేమ శాతం పరీక్షించే పరికరాలు టార్పాలిన్లు ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు ఆరబెట్టే సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు రైతులకు తాగునీరు నీడ విద్యుత్ మరుగుదొడ్లు ప్రథమ చికిత్స వంటి సదుపాయాలు కల్పించాలన్నారు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతుల వివరాలు అవసరమైన గుర్తింపు పత్రాలను పరిశీలించి టోకెన్లు కేటాయించాలని రైతుల ధాన్యాన్ని వేర్వేరుగా గుర్తించి క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు ధాన్యంలో తేమ శాతాన్ని డిజిటల్ మీటర్లతో పరీక్షించి నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు తేమ శాతం అనుమతించిన పరిమితిలో సాధారణంగా 17 శాతానికి మించకుండా ఉన్నప్పుడు నిర్దేశిత నాణ్యత ప్రమాణాల ప్రకారం తూకం ప్రక్రియ చేపట్టాలని వివరించారు కొనుగోలు చేసిన ధాన్యాన్ని సంచుల్లో నింపడం క్రమపద్ధతిలో నిల్వ చేయడం ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు కొనుగోలు లావాదేవీలను నమోదు చేయడం సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు లేదా కేటాయించిన మధ్యంతర గోదాముల మాత్రమే రవాణా చేయాలని రవాణా పత్రాలు మిల్లుల నుంచి ధాన్యం అందినట్లు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా పొందాలని సూచించారు వాహనాలను అనవసరంగా నిలిపివేయకుండా ధాన్యం చేరిన 24 గంటల్లో నిర్దేశిత ప్రాంతంలో అన్‌లోడింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు రైతులకు కనీస మద్దతు ధరకు అనుగుణంగా చెల్లింపులు నిబంధనల ప్రకారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలని తెలిపారు కొనుగోలు చేసిన ధాన్యం రవాణా చేసిన పరిమాణం మిల్లుల్లో అందిన ధాన్యం మిగిలిన నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు సరి చూసుకుంటూ రికార్డులు పక్కాగా నిర్వహించాలని సూచించారు అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు కొనుగోలు కేంద్రాల్లో తూకం ఆలస్యం కూలీల కొరత వాహనాల కొరత ధాన్యం ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడం వంటి సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు వరి ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత నాణ్యత ఖచ్చితమైన ఆన్‌లైన్ నమోదు సకాలంలో రవాణా రైతులకు నిబంధనల ప్రకారం చెల్లింపులు జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు ఈ సమావేశంలో

అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎన్ ప్రసూనాంబ ఆర్డీవోలు మధు సూదన్ జీవాకర్ రెడ్డి డీసీఓ మనోజ్ కుమార్ డిఆర్డిఓ రఘువరన్ డిఎస్ఓ జితేందర్ రెడ్డి డిఎం సివిల్ సప్లైస్ జితేంద్ర ప్రసాద్ డిఎంఓ డిఎల్ఎంఓ ఎల్డివిఎం రాము తహశీల్దార్లు ఎంపీడీవోలు ఎంపీడీవోలు డిప్యూటీ తహశీల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తండ్రి జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలకు 11 డ్యూయల్ డెస్క్‌ల విరాళం

**పూర్వ విద్యార్థి మేకల మనోహర్**

**రామడుగు, అక్టోబర్ 24(వు దయం ప్రతినిధి )**



కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొరటపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడిన మేకల మనోహర్ తన తండ్రి జ్ఞాపకార్థం కొరటపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు 11 డ్యూయల్ డెస్క్‌లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మండల విద్యాధికారి (MEO), ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఒకప్పుడు తాను విద్యనభ్యసించిన పాఠశాలను మరచిపోకుండా, అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం డ్యూయల్ డెస్క్‌లను అందించడం మేకల మనోహర్ విద్య పట్ల చూపుతున్న గౌరవానికి, తన గ్రామం పట్ల ఉన్న మమకారానికి నిదర్శనమని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. తన తండ్రి జ్ఞాపకాలను సమాజహిత కార్యక్రమంతో ముడిపెట్టి, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుతం కొరటపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 22 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి మెరుగైన బోధనా వాతావరణాన్ని కల్పించడంలో ఈ డ్యూయల్ డెస్క్‌లు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. విద్యార్థులు సౌకర్యవంతంగా కూర్చొని చదువుకోవడానికి, పాఠశాలలో అభ్యసన వాతావరణాన్ని మెరుగుపరచడానికి ఈ విరాళం దోహదపడనుంది.

ఈ సందర్భంగా మండల విద్యాధికారి రంగనాథ్ శర్మ మాట్లాడుతూ, “ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ముందుకు రావడం ఎంతో స్ఫూర్తిదాయకం. తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలి. పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకు వస్తే పాఠశాలల్లో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చు. మేకల మనోహర్ చేసిన ఈ సహకారం ఇతరులకు ఆదర్శంగా నిలవాలి” అని పేర్కొన్నారు. అలాగే, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో గ్రామ ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, విద్యార్థుల అవసరాలను గుర్తించి సహకారం అందించిన మేకల మనోహర్‌ను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి భవిష్యత్తులో కూడా గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా పూర్వ విద్యార్థులు తమ విద్యాభ్యాసానికి పునాది వేసిన పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలనే సందేశం వెలువడింది. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను సమకూర్చడం ద్వారా వారి విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించిన మేకల మనోహర్ సేవాభావాన్ని గ్రామస్థులు, పాఠశాల వర్గాలు ప్రశంసించాయి. గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానుకూల పోలీసింగ్‌పై వ్యాసరచన పోటీలు

**పోలీసు అధికారులు, సిబ్బందిలో సేవాభావం పెంపొందించడమే లక్ష్యం**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి) : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులు, సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు ఈ పోటీలు చేపట్టారు. ప్రజాసేవ పట్ల నిబద్ధతను పెంపొందించడం, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపర్చడం, ప్రజానుకూల పోలీసింగ్‌పై అవగాహన కల్పించడం లక్ష్యంగా పోటీలు నిర్వహించారు. పోలీసు కానిస్టేబుల్ నుంచి అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఏఎస్సై) హోదా వరకు ఉన్న సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందికి ఒక విభాగంలో పోటీలు నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల నుంచి ప్రజలు ఆశించే సేవలు, పోలీసు అధికారుల జీవితాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, వాటిని వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాలకు సద్వినియోగం చేసుకునే విధానాలపై వ్యాసాలు రాయాలని సూచించారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్సై), రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్సై), ఆపై హోదాల్లో ఉన్న అధికారులకు మరో విభాగంలో పోటీలు నిర్వహించారు. ప్రజల నుంచి గౌరవం, ఆదరణ, సద్భావన పొందేందుకు పోలీసులు చేపట్టాల్సిన చర్యలు, క్షేత్రస్థాయిలో పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేసే మార్గాలపై అంశాలను కేటాయించారు.



**ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం..**

ఈ పోటీల ద్వారా విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, తమ అనుభవాలు, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు అనుసరించాల్సిన విధానాలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచే అవకాశం కల్పించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పోలీసు అధికారులు తెలిపారు.

## ఆత్మకూర్(ఎస్)లో వైఆర్జీ కేర్ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం

**కలిసి జీవిస్తే హెచ్ఐవీ రాదు - అపోహలు వద్దు, అవగాహన ముద్దు!**



**సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 24 - వుదయం ప్రతినిధి:**

ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో వైఆర్జీ కేర్ లింక్ వర్కర్ స్కీమ్, నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ సూపర్వైజర్ బి. సుజాత మాట్లాడుతూ.. హెచ్ఐవీతో బాధపడుతున్న వారితో కలిసి జీవించడం, కరచాలనం చేయడం, మరుగుదొడ్డి పంచుకోవడం లేదా దోమలు కుట్టడం ద్వారా హెచ్ఐవీ వ్యాపించ దని వివరించారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, కలుషిత సూదులు, సిరంజిలు, కలుషిత రక్తం మార్పిడి, హెచ్ఐవీ సోకిన తల్లి నుంచి బిడ్డకు వ్యాధి సంక్రమించే అవకాశం ఉందని తెలిపారు. హెచ్ఐవీ స్థితిని తెలుసుకునేందుకు వైద్యుల సూచన మేరకు పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధిపై అపోహలు వీడి ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరిబండి ఉపేంద్ర, గ్రామ కార్యదర్శి సతీష్, ఎంఎల్హెచ్పీ ఎస్. రమ్య తేజ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, లింక్ వర్కర్లు ప్రియాంక, సునీత పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించడంతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు.

## కాంట్రాక్టు విధానం రద్దు చేయాలి

- కార్మికులందరిని పర్మినెంట్ చేయాలి
- అక్టోబరు 26న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం

**నల్లగొండ, అక్టోబరు 24, జిల్లా వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వల్లపుదాసు భూలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆసుపత్రి యూనిట్ ఆధ్వర్యంలో పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు, పారిశుద్ధ్య కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు సక్రమంగా కల్పించాలని కోరారు. సమావేశం అనంతరం నల్లగొండ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి యూనిట్‌కు 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దండెంపల్లి సత్తయ్య, అధ్యక్షుడిగా మునగ వెంకన్న, ఉపాధ్యక్షులుగా వలికి లలిత, నాగలక్ష్మి, పి. భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా అవుట రవీందర్, వర్కింగ్ సెక్రటరీగా బోడ జానకి, సహాయ కార్యదర్శులుగా ఏ. కృష్ణయ్య, శ్రీకాంత్, అండాలు, కోశాధికారిగా కట్ట ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా లక్ష్మయ్య, ఎస్. పరమేష్, సరోజ, లక్ష్మమ్మ, ఎస్. మాధవి, చంద్రకళలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లక్కపాక రాజు, దండెంపల్లి సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు గంజి రాజేష్, మునగ వెంకన్న, జానకి, లలిత, అండాలు, సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## 12 రోజులుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

- 17,541 మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన
- టీకాల కార్యక్రమానికి ఆటంకం.. తల్లీబిడ్డల ఆరోగ్య సేవలకు విఘాతం
- ఎన్‌సీడీ సేవలు నిలిచిపోవడంతో రోగులకు ఇక్కట్లు

**నల్గొండ జిల్లా అక్టోబర్ 24, వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ముందు 12వ రోజు ఎన్ఎంహెచ్ ఉద్యోగులు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె బాట పట్టారు. ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం, వేతనాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తున్నారు. 33 జిల్లాల్లో 17,541 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటుండగా, 12 రోజులుగా నిరసనలు కొనసాగుతున్నా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు. మరోవైపు సమ్మె ప్రభావం ప్రజారోగ్య సేవలపై పడుతోంది. టీకాల కార్యక్రమం, గర్భిణులు, బాలింతలకు అందించే వైద్య సేవలు, అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, పర్యవేక్షణ కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**హక్కుల కోసం అలుపెరగని పోరు**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని చాలాకాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. సమ్మెకు పలు రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఏఐటీయూసీ, సీపీఐ, బీజేపీ, బీఆర్ఎస్, తెలంగాణ రక్షణ సేన, జనసేన తదితర పార్టీల నాయకులు ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ కూడలితో పాటు హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన దీక్షలు చేపడుతున్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని వారు పేర్కొంటున్నారు.

**వైద్య సేవలకు విఘాతం**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెతో క్షేత్రస్థాయి వైద్య సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. పిల్లలకు నిర్ణీత సమయంలో అందించాల్సిన టీకాల కార్యక్రమం ప్రభావితమవుతోంది. గర్భిణులకు అందించే యాంటీనేటల్ కేర్ (ఏఎన్‌సీ), ప్రసవం తర్వాత తల్లీబిడ్డలకు అవసరమైన పోస్ట్‌నేటల్ కేర్ (పీఎన్‌సీ) సేవలకు విఘాతం కలుగుతోంది. మధుమేహం,

రక్తపోటు వంటి అసంక్రమిత వ్యాధుల గుర్తింపు, పర్యవేక్షణకు సంబంధించిన ఎన్‌సీడీ సేవలపైనా ప్రభావం పడుతోంది. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో కీలకంగా వ్యవహరించే సిబ్బంది సమ్మెలో ఉండటంతో సేవలు పొందాల్సిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలను త్వరగా పరిష్కరించి వైద్య సేవలను సాధారణ స్థితికి తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది.

**ఉప ముఖ్యమంత్రికి వినతి**

తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రిన్సిపల్ హెల్త్ సెక్రటరీ క్రిస్టినాను కలిశారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను వారి దృష్టికి తీసుకెళ్లారు. అన్ని కేడర్ల ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, ఉద్యోగ భద్రత కల్పించడం, 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించడం, వేతనాల పెంపు వంటి అంశాలను వివరించారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు జేఏసీ నాయకులు వెల్లడించారు. అయితే డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి స్పష్టమైన హామీ, కార్యాచరణ వెలువడాల్సి ఉంది. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పుట్ట మహేందర్‌రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టీ. భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎండీ రుక్కుద్దీన్, అధికార ప్రతినిధి బి. శ్రీనివాస్, ఏఎన్ఎంల ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

**ఇవీ ప్రధాన డిమాండ్లు**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు.

రెగ్యులరైజేషన్: అన్ని కేడర్ల ఉద్యోగులకు కేడర్ ఫిక్సేషన్ చేసి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి.

వేతనాలు: రెగ్యులరైజేషన్ జరిగే వరకు 100 శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలి. 2018 నుంచి వేతనాల పెంపులో జరిగిన నష్టాలను సరిదిద్దుతూ కొత్త జీవో విడుదల చేయాలి.

ఉద్యోగ భద్రత: హెల్త్ కార్డులు, ఆరోగ్య బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలి.

సెలవులు: ఏడాదికి 35 క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలి. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలి.

వేతన పెంపు: కేంద్ర ప్రభుత్వం ప్రకటించే ఐదు శాతం వేతన పెంపును అమలు చేయాలి.

కారుణ్య నియామకాలు: విధి నిర్వహణలో ఉద్యోగి మరణిస్తే ఆరు నెలల్లోగా కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలి.

ఏఎన్ఎంల నియామకాలు: ఎంపికైన ఏఎన్ఎంలకు నియామక ఉత్తర్వులు జారీ చేయాలి.

వేతన బకాయిలు: 1195 జీవో కింద పెరగాల్సిన వేతన బకాయిలను విడుదల చేయాలి.

**సేవలకు గుర్తింపు ఏదీ?**

ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం, వ్యాధుల నియంత్రణ, తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణ వంటి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు అందడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చర్చలతో పరిష్కారం లభించేనా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రాంబాబు, డాక్టర్ రమేష్, ఆడియాలజిస్టులు అనిల్, సంతోష్, డాక్టర్ వెంకటేశం, ల్యాబ్ టెక్నిషన్ సురేష్ ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమష్టిగా కృషి చేయాలి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- రానున్న 10 నెలల పాటు మనుషులు, పశువుల తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి
- విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా కోతలు లేకుండా నిరంతరాయ సరఫరా
- నీటిని సంరక్షిస్తూ తాగునీటికే ప్రాధాన్యమివ్వాలి
- నీటి సంరక్షణ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు చర్యలు



**ఖమ్మం వుదయం బ్యూరో, చింతకాని, అక్టోబర్- 24:**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 150దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రానున్న రోజుల్లో తలెత్తే కరువు పరిస్థితి లను ఎదుర్కొనేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డితో కలిసి విస్తృతంగా పర్యటించిన అనంతరం కొదుమూరు గ్రామంలో డిప్యూటీ సీఎం మీడియా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని తెలిపారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని, దీంతో ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీరు ఆవిరైపోవడంతో పాటు భూగర్భ జలాలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని అన్నారు. రాబోయే 10 నెలల పాటు మనుషులు, పశువుల తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 44 వేల చెరువుల్లో సుమారు 40 శాతం చెరువుల్లో కనీసం పావు వంతు కంటే తక్కువ నీరు ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కరువు పరిస్థితి లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సూచించిన జాగ్రత్తలను ప్రజలు, రైతులు పాటిస్తూ ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరించాలని కోరారు.

**విద్యుత్ డిమాండ్ పెరిగినా కోతలు లేకుండా సరఫరా:**

రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ అన్ని వర్గాల ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. 2014లో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,648 మెగావాట్లు ఉండగా, 2023లో 15,497 మెగావాట్లకు చేరిందని, ప్రస్తుతం 20 వేల మెగావాట్లకు పైగా డిమాండ్ నమోదవుతోందని వివరించారు. గృహ అవసరాలు, వ్యవసాయ పంపుసెట్లు, ఎత్తిపోతల పథకాల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్ అధికమవుతోందని తెలిపారు.

**సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు:**

విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ పరిధిలో కొత్తగా 680 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయగా, 177 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ట్రాన్స్‌కో పరిధిలో 24 సబ్ స్టేషన్లు అనుమతులు మంజూరు చేయగా, 11 సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు.

**పంపుసెట్ల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలి:**

రాష్ట్రంలో సుమారు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లు ఉండగా, వాటిలో దాదాపు 15 లక్షల పంపుసెట్లు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ప్రభావితమయ్యాయని డిప్యూటీ సీఎం తెలిపారు. నీరు లేకున్నా మోటార్లు నడపడం, ఒకేసారి అధిక విద్యుత్ లోడ్ పడటం వల్ల కొన్ని ప్రాంతాల్లో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని చెప్పారు. భూగర్భ జలాలు అందుబాటులో లేనప్పుడు మోటార్లు ఆన్ చేయవద్దని, పంపుసెట్లకు అమర్చిన ఆటో స్టార్టర్లను తొలగించాలని రైతులకు సూచించారు. విద్యుత్ వినియోగంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు.

**ఉపాధి హామీ పనులతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన:**

కరువు పరిస్థితుల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రతి గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన మేరకు నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.

**రాజకీయాలకు ఇది సమయం కాదు.. ప్రజలను కాపాడుకోవడమే లక్ష్యం:**

సూపర్ ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కోవడంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇది రాజకీయాలు చేసే సమయం కాదని, ప్రజలను ఈ సంక్షోభం నుంచి కాపాడుకోవడమే ప్రతి ఒక్కరి బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ప్రజలందరూ నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, ప్రభుత్వ యంత్రాంగం సహకరించాలని కోరారు. గ్రామాల వారీగా ప్రజలకు అవగాహన కల్పించి, నీటి సంరక్షణతో పాటు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మీడియా సమావేశంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, సంబంధిత అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల స్ఫూర్తితో రక్తదాన శిబిరం

- రక్తదానం.. ప్రాణదానంతో సమానం
- యువత సేవాభావం అభినందనీయం

**: ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్లగొండ, అక్టోబరు 24, జిల్లా వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో రక్తం అందించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశం కోసం, ప్రజల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వారి స్ఫూర్తితో నిర్వహిస్తున్న రక్తదాన కార్యక్రమం ద్వారా ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేసే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, ప్రమాదాల్లో గాయపడినవారికి, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులకు, ప్రసవ సమయంలో అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలకు రక్తం ఎంతో అవసరమని తెలిపారు. యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్న అర్హులైన వ్యక్తులు వైద్యుల సూచనల మేరకు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడటంతోపాటు వారి కుటుంబాల్లో ఆశలు నింపవచ్చని చెప్పారు. రక్తదాన శిబిరంలో ఉత్సాహంగా పాల్గొన్న అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు, యువతను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమాజ సేవ పట్ల యువత చూపుతున్న ఆసక్తి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్బీ డీఎస్పీ మల్లారెడ్డి, నల్లగొండ డీఎస్పీ కె. శివరాం రెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, నాగరాజు, శ్రీనునాయక్, మంజుల, ఆర్ఐలు సంతోష్, సూరపు నాయుడు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, అమ్మ ఫౌండేషన్ సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి వర్షపు చుక్కను ఒడిసిపట్టాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట అక్టోబర్ 24, వుదయం ప్రతినిధి**



వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాతో పాటు స్థానిక నీటి వనరులను గుర్తించి, వార్డు వారీగా తాగునీటి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వారం రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసి, గ్రామసభలో ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. ఆత్మకూరు(ఎస్) మండలంలోని మిద్దనపల్లి గ్రామంలో నిర్వహించిన సమీక్షలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులతో తాగునీరు, ఉపాధి హామీ పనులు, భూగర్భ జలాల పెంపు తదితర అంశాలపై చర్చించారు.

గ్రామంలో ప్రస్తుతం మూడు బోర్లు అందుబాటులో ఉన్నాయని, వాటి ద్వారా నీటి సరఫరా జరుగుతోందని అధికారులు వివరించారు. అయితే భూగర్భ జలాలు మరింత తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. బోర్ల నుంచి నేరుగా పైపులైన్లకు నీటిని సరఫరా చేస్తున్న నేపథ్యంలో అవసరమైన శుద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు.

మిషన్ భగీరథ సరఫరా పరిస్థితిని పరిశీలించి, నీటి వనరుల లభ్యతను అంచనా వేయాలన్నారు. ప్రతి వార్డు, కాలనీ, గేరీ వారీగా ఎక్కడ నీరు అందుతోంది? ఎక్కడ సమస్య ఉంది? అనే వివరాలను సేకరించాలని ఆదేశించారు. ప్రధాన నీటి వనరు పనిచేయకపోతే ప్రత్యామ్నాయంగా ఎక్కడి నుంచి నీటిని సరఫరా చేయవచ్చో ముందుగానే గుర్తించాలని తెలిపారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నీటి వనరులతో పాటు ఫ్లషింగ్ బోర్లను కూడా ప్రత్యామ్నాయంగా పరిశీలించాలని సూచించారు.

గ్రామంలోని ఓవర్‌హెడ్ సర్వీస్ రిజర్వాయర్ (ఓహెచ్ఎస్ఆర్) ట్యాంకుల వద్దకు వెళ్లేందుకు మెట్లు లేవని అధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన పనులను ఉపాధి పథకం లేదా ఇతర నిధుల ద్వారా చేపట్టే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు.

వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించడం ద్వారా వర్షపు నీటితో పాటు గృహ అవసరాలకు వినియోగించిన నీటిని కూడా భూమిలోకి ఇంకించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.

మురుగు కాల్వల వద్ద డ్రైనేజీ సోక్‌పిట్లు, రోడ్లకు ఇరువైపులా సోకేజ్ ఛానళ్లు నిర్మించాలని పేర్కొన్నారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాల్లో కమ్యూనిటీ సోక్‌పిట్లు ఏర్పాటు చేయడం ద్వారా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. తాగునీటి బోర్ల వద్ద భూగర్భ జలాల పునరుద్ధరణకు రీచార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

ఉపాధి పథకం కింద చేపట్టాల్సిన పనుల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, అవసరమైన చోట సోకేజ్ ఛానల్, డ్రైనేజీ సోక్‌పిట్, తాగునీటి వనరుల పునరుద్ధరణ పనులు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాలని సూచించారు. గ్రామపంచాయతీ అధికారులు, ప్రజలు కలిసి పనుల అమలును పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా పనులను గుర్తించి, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారం, భూగర్భ జలాల పెంపు, గ్రామీణ ఉపాధి కల్పన, పారిశుద్ధ్య మెరుగుదలకు సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు.

సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా పరిషత్ సీఈవో శిరీష, డీఆర్‌డీవో సన్యాసయ్య, డీఏవో శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ అనిల్ సింగ్, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, వైద్యాధికారి రమ్య, వ్యవసాయ శాఖ అధికారులు, విద్యుత్తు శాఖ ప్రతినిధులు, ఏపీవో, ఏపీఎం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి!

**ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతుల విజ్ఞప్తి**

**కల్లూరు, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**



ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఓటు ప్రజాస్వామ్యంలో కీలకమని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా ఓటు హక్కును పొందేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులు డిగ్రీ మెమో, ఆధార్ కార్డు, ఫొటో, మొబైల్ నంబర్ వివరాలతో ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 6, 2026 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ అని పేర్కొంటూ, గడువు ముగిసే లోపే అర్హులైన పట్టభద్రులందరూ తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. "అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడు తన ఓటు హక్కును పొందాలి. ఒక్కరూ నిర్లక్ష్యం వల్ల అవకాశాన్ని కోల్పోవద్దు" అని ఎమ్మెల్యే దంపతులు విజ్ఞప్తి చేశారు.



## పాఠశాల సంఘటనపై ఎస్ఐ విచారణ

**అనంతగిరి అక్టోబర్ 24 వుదయం**

అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలో ఎస్సీ కాలనీలో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల 2 జరిగిన సంఘటనపై పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతగిరి ఎస్సై ఏడుకొండలు శనివారం పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్ఐ అడిగి తెలుసుకున్నారు గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు పాఠశాల హెడ్మాస్టర్ జ్యోతి ఉపాధ్యాయులు శేఖరు జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను ఎస్ఐ ఏడుకొండలకు వివరించారు విచారణ అనంతరం ఎస్సై మాట్లాడుతూ .గ్రామంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవగాహన కార్యక్రమాన్నీ ఏర్పాటు చేయాలని సర్పంచ్ కి చూసించారు.



## చిన్నారిని ఆశీర్వదించిన సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**చింతకాని అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**

మండలం పరిధిలోనే వందనం గ్రామంలో గ్రామ ఉపసర్పంచ్ అమర్లపూడి శ్రీనివాసరావు మనవడు సాయి శశిధర్ మొదటి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారి సాయి శశిధర్ ను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. చిన్నారి కుటుంబ సభ్యులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



## నాగుపల్లి గ్రామంలో రైతులకు పరిహారం పంపిణీ

**సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేసిన మంత్రి తుమ్మల , ఎమ్మెల్యే జారె**

**దమ్మపేట అక్టోబర్ 24, (వుదయం ప్రతినిధి):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకం సత్తుపల్లి ట్రంక్ కెనాల్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార మార్కెటింగ్ శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు అశ్వారావుపేట నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం చెక్కులను అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సివిక్స్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- 26న డెమోకు హాజరుకావాలి
- తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె. వీరబాబు

**మునగాల, అక్టోబర్ 24 (వుదయం):**

మునగాల మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో కాలపరిమితి ప్రాతిపదికన పీజీటీ (సివిక్స్) అధ్యాపక పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కె. వీరబాబు తెలిపారు. ఈ పోస్టుకు ఎం.ఏ. (సివిక్స్), బీఈడీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు 9, 10వ తరగతులకు సోషల్ స్టడీస్‌తో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు సివిక్స్ సబ్జెక్టును బోధించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గంటలకు పాఠశాలకు హాజరై డెమో ఇవ్వాలని సూచించారు. పోస్టుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రిన్సిపల్ కె. వీరబాబు కోరారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికే ప్రభుత్వం ప్రాధాన్యత

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- చింతకాని మండలంలో రూ.125 కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

**చింతకాని, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో శనివారం డిప్యూటీ సీఎం పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిలతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు.

**శంకుస్థాపన చేసిన పనులు:**

పొద్దుటూరు గ్రామంలో: రూ.3.5 కోట్లతో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం. తిమ్మినేని పాలెం గ్రామంలో రూ.8.25 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం. రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం వరకు దేవరపల్లి హైవేను కలుపుతూ రూ.3 కోట్లతో బీటీ రోడ్డు, రామకృష్ణాపురం నుంచి పెద్దగోపతి రోడ్డు వరకు రూ.50 కోట్లతో రహదారి విస్తరణ, బలోపేతం పనులు కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ.60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా విస్తరణ, బలోపేతం పనులు

**ప్రారంభించిన పనులు:–**

తిమ్మినేనిపాలెం ఎస్సీ కాలనీలో రూ.62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవుతాయని, నూతన సబ్ స్టేషన్లతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, కొదుమూరు రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ ప్రాజెక్టుపై ఆరోపణలు తగవు

- కేసీఆర్, జగదీశ్‌రెడ్డిపై మాట్లాడే హక్కు రేవంత్‌రెడ్డికి లేదు
- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్

**నల్లగొండ జిల్లా అక్టోబర్ 24, వుదయం ప్రతినిధి**



నల్గొండ పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్తు వెలుగులు అందించే యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవినీతి ఆరోపణలు చేయడం తగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టును దామరచర్లలో ఏర్పాటు చేయడంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యుత్తు శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని తెలిపారు. 4,000 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టును ఏర్పాటు చేసి రాష్ట్ర విద్యుత్తు అవసరాలను తీర్చేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధికి దోహదపడే ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ఆశించిన పురోగతి లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై విమర్శలు చేయడం మానుకోవాలని సూచించారు. కేసీఆర్, జగదీశ్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆయన క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని నాగార్జున ముదిరాజ్ హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు నోముల శంకర్ యాదవ్, క్రాంతికుమార్, కాడింగు శ్రీకాంత్, గౌతమ్‌కుమార్, వెంకట్, లోకేశ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**అనంతగిరి అక్టోబర్ 24 వుదయం**



కోదాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అనంతగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాయిల సింగారం గ్రామ కాంగ్రెస్ నాయకులు కోదాడలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని ముస్కు శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించడంతో పాటు పూల బొకే అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముస్కు శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వాయిల సింగారం గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు కంటు వేణు, కంటు నాగేశ్వర రావు, పున్నయ్య, గోపి, శివ, సైదులు, రాజు, గుల్లపల్లి వెంకన్న, పుల్లయ్య, కిట్టయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం

- న్యాయపరమైన చిక్కులు లేని ప్రాంతంలో కేటాయింపునకు కార్యాచరణ
- సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నల్గొండ జిల్లా అక్టోబర్ 24, వుదయం ప్రతినిధి



File Photo

తెలంగాణ రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేస్తామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. న్యాయపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008లో జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో స్థలాల పంపిణీ ప్రక్రియ దీర్ఘకాలం నిలిచిపోయిందన్నారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగినప్పటికీ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబరు 8న రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో భూమిని అప్పగించినట్లు వివరించారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు తలెత్తడంతో శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.

**మంత్రులతో పలుమార్లు చర్చించి**

ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి సమగ్రంగా సమీక్షించినట్లు పొంగులేటి తెలిపారు. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, జర్నలిస్టులు తమ కుటుంబాలతో గౌరవంగా జీవించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని భరోసా ఇచ్చారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ ముందుకు సాగిందని, మరోసారి తమ ప్రభుత్వంలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## గ్రామీణ సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి

**ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలి: కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి) 24 అక్టోబర్ 2026



గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటికి సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. శనివారం సాయంత్రం కుభీర్ మండలంలోని పార్డి (బి), హల్దా గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి స్థానిక ప్రజలు, రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ముందుగా పార్డి (బి) గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామ సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం హల్దా గ్రామంలో రైతులతో సమావేశమైన కలెక్టర్, గ్రామంలో నెలకొన్న సీలింగ్ భూములకు సంబంధించిన సమస్యలపై ఆరా తీశారు. భూములకు సంబంధించిన వివరాలను అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. సీలింగ్ భూముల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రైతులకు వివరించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ శ్రీదేవి, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 15న "హలో నేతకాని - చలో ఉస్మానియా




**వర్గీకరణలో నేతకానీలకు జరిగిన అన్యాయంపై పోరుబాట**

జన్నారం,అక్టోబర్ 24 (వుదయం విలేఖరి)

రాష్ట్ర ప్రభుత్వం అశాస్త్రీయంగా చేపట్టిన ఎస్సీ వర్గీకరణలో నేతకాని కులానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ అన్యాయంపై పోరుబాటలో భాగంగా నవంబర్ 15న హలో నేతకాని – చలో ఉస్మానియా కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామని ప్రోగ్రాం కన్వీనర్, నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సాయిని ప్రసాద్ నేత తెలిపారు.రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా శనివారం జన్నారం మండల కేంద్రంలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో నేతకాని కుల సంఘం మండల అధ్యక్షులు రత్నం లక్ష్మణ్,ప్రసాద్ నేత లు పాల్గొని మాట్లాడారు.వర్గీకరణలో నేతకానీలు ఏ విధంగా నష్టపోయారో వివరించారు. ప్రభుత్వాలు స్పందించే విధంగా తమకు న్యాయం జరిగే దిశగా కార్యక్రమాలు చేపడుతూ నేతకాని సమాజాన్ని చైతన్యపరిచి ఉద్ధృతంగా ఉద్యమాలు నిర్వహించబోతున్నట్లు వివరించారు. జన్నారం మండల నేతకాని కుల బాంధవులు అధిక సంఖ్యలో హలో నేతకాని చలో ఉస్మానియా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.2002లో చేపట్టిన ఎస్సీ కులాల వర్గీకరణ ఏబీసీడీ అను నాలుగు గ్రూపులుగా విభజించబడినప్పుడు 2024 వర్గీకరణలో 1,2,3 అని మూడు గ్రూపులుగా ఎందుకు విభజించారో తెలియజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని ప్రశ్నించారు. ఇలాంటి అనేక అంశాలను చలో ఉస్మానియాలో చర్చించబోతున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో కార్యక్రమ డైరెక్టర్ తాళ్లపల్లి రాజేశ్వర్, వైస్ చైర్మన్ బోర్లకుంట ప్రభుదాస్, కో కన్వీనర్ జాడి గంగాధర్, మాజీ ఎంపీపీ కామెరా రవిశంకర్, విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి దుర్గం వినోద్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, పట్టణ అధ్యక్షులు దుర్గం వసంత్, సీనియర్ నాయకులు జునుగురి మల్లయ్య, కే భూచాయ, దుర్గం నందయ్య, దత్తు, దుర్గం లక్ష్మీరాజం, వెంబడి భాస్కర్, పెరుగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి వృథాను అరికట్టాలి.. కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి!

- వచ్చే జూలై వరకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి
- మండల ప్రత్యేక అధికారి మహాలక్ష్మి

మునగాల, అక్టోబర్ 24 (వుదయం):



ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి వృథాను అరికట్టాలని, వచ్చే జూలై వరకు ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ జిల్లా పరిషత్ సీఈవో మహాలక్ష్మి సూచించారు. మండల ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్ సమక్షంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా గ్రామపంచాయతీల పరిధిలో అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటిని పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి వృథాను అరికట్టేందుకు గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా వీబీజీ రామ్‌జీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో అర్హులైన వారందరికీ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. రాబోయే యాసంగి సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా మెట్ట పంటల సాగుపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తగిన సూచనలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో మండలంలోని సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## గూడెంలో శనీశ్వరునికి తైలాబిషేకం

దండేపల్లి: అక్టోబర్ 24 (వుదయం విలేకరి)

దండేపల్లి మండలంలోని గూడెం గోదావరి నది ఒడ్డున స్వయంభుగా వెలిసిన శనీశ్వరాలయంలో శని త్రయోదశి సందర్భంగా శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో శనీశ్వరునికి తైలాభిషేకం నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా ఆలయ పూజారి భూమన్న మాట్లాడుతూ శనీశ్వరునికి పూజలు చేసే భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కులు చెల్లించుకోవాలన్నారు.



## దండేపల్లిలో టీఎన్జీవో సభ్యత్వ నమోదు

దండేపల్లి అక్టోబర్ 24 (వుదయం విలేఖరి)

టీఎన్జీవో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో లక్షెట్టిపేట యూనిట్ దండేపల్లి మండలంలో సుమారు 55 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులు శనివారం సభ్యత్వం తీసుకున్నట్లు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి తెలిపారు ఈ సందర్భంగా గడియారం శ్రీహరి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని ప్రతి యూనిట్లో సభ్యత్వ నమోదును త్వరగా పూర్తిచేసి రాష్ట్రంలోనే మంచిర్యాల జిల్లా మొదటి స్థానంలో ఉండి ఆదర్శంగా ఉండాలని అన్నారు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టిఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి బొడ్డు శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు పూదరి నరేందర్,లక్షెటిపేట యూనిట్ అధ్యక్షులు గోళ్ళ శ్రీనివాస్,యూనిట్ ఉపాధ్యక్షులు భూమన్న, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

## లక్ష్మీ సెహగల్ ఆశయాలను కొనసాగించాలి

- మహిళా హక్కుల కోసం ఉద్యమించాలి
- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

నల్లగొండ, జిల్లా అక్టోబరు 24: వుదయం ప్రతినిధి



నల్గొండ పట్టణ కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధురాలు, ప్రముఖ వైద్యురాలు కెప్టెన్ డాక్టర్ లక్ష్మీ సెహగల్ జీవితం నేటి మహిళలకు స్ఫూర్తిదాయకమని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. మహిళల హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జయంతి సందర్భంగా శనివారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవనంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతోపాటు మహిళల హక్కుల సాధనకు లక్ష్మీ సెహగల్ జీవితాంతం కృషి చేశారని కొనియాడారు.లక్ష్మీ సెహగల్ ధైర్యం, త్యాగం, సేవాభావం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మహిళా హక్కుల సాధన కోసం ఐద్వా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తుందని ప్రభావతి తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కొండా అనురాధ, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జిల్లా కమిటీ సభ్యురాలు బొల్లాపల్లి మంజుల, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



## దండేపల్లిలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

దండేపల్లి: అక్టోబర్ 24 (వుదయం విలేకరి )

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ బియ్యం పొందేందుకు వీలుగా ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డులను శనివారం దండేపల్లి మండల కేంద్రంలో తహసిల్దార్ రోహిత్ దేశ్పాండే,నెల్కి వెంకటాపూర్ సహకార సంఘం అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ తో కలిసి పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు రేషన్ బియ్యం అందించేందుకు డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోందని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ బొద్దుల భూమన్న,సర్పంచ్ అజ్మీర రాజేశ్వర్ నాయక్,ఉప సర్పంచ్ సిరికొండ నవీన్,పంచాయతీ కార్యదర్శి హరీష్,వార్డు సభ్యుడు కట్కూరి రాజయ్య,రేషన్ డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌లో అనంతగిరి ఎస్ఐకి ప్రశంసలు

- కేసుల పరిష్కారంలో ఎస్సై ఏడుకొండలు కృషికి గుర్తింపు
- ఇదే స్ఫూర్తితో మరిన్ని కేసులు పరిష్కరించాలి: సీనియర్ జడ్జి సురేష్

అనంతగిరి అక్టోబర్ 24 వుదయం

లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేసిన అనంతగిరి ఎస్ఐ ఏడుకొండలు ను కోర్టు సీనియర్ జడ్జి సురేష్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐకి ప్రశంసాపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జడ్జి సురేష్ మాట్లాడుతూ.. రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందించడంతోపాటు సమయం, ఖర్చు ఆదా చేయడంలో లోక్ అదాలత్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కేసుల పరిష్కారంలో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని కేసులను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఏడుకొండలకు సూచించారు.

## బి ఎల్ వో లకు తగిన గౌరవ వేతనం ఇవ్వాలంటూ తహసిల్దార్ కు వినతి

జన్నారం,అక్టోబర్ 24 (వుదయం విలేఖరి)



తమకు తగిన గౌరవ వేతనం ఇవ్వాలంటూ జన్నారం మండలానికి చెందిన పలువురు బిఎల్వోలు శనివారం మధ్యాహ్నం తహసిల్దార్ బక్కయ్యకు వినతి పత్రం అందజేశారు.ఖానాపూర్ నియోజకవర్గంలోని తాము జన్నారం మండలానికి చెందిన వారమని అధికారులు చెప్పిన ప్రతి పనిని తాము చేస్తున్నామన్నారు.2024 ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు రూ. 2,500/- లు ఇచ్చారని, ఆ తర్వాత జూన్ 2026లో రూ. 4000/- లు ఇచ్చారని, అదే సమయంలో దండేపల్లి మండలంలోని బి ఎల్ ఓ లకు 5100 రూపాయలతో కూడిన గౌరవ వేతనం ఇచ్చారని కానీ వీటి మధ్య తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు.తాము చేస్తున్న పనులన్నీ అధికారులకు తెలుసనని, ఓటరు లిస్టు,ఆధార్ లు సహా చెప్పిన ప్రతి పని చేయడం తమ బాధ్యతగా భావించి విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు.తాము చేసిన పనులకు ఇంకా పూర్తి డబ్బులు రాలేదని,సర్ సర్వే విషయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పనులన్నీ ముగించామని, కావున తమ పనికి తగిన గౌరవ వేతనం ఇవ్వాలంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు. గత మూడు నెలల నుండి తమకు గౌరవ వేతనం రాక తీవ్ర ఇబ్బందులు పడుతూ, కుటుంబాలను పోషిస్తున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు రావాల్సిన డబ్బులను వెంటనే ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు బిఎల్వోలు పాల్గొన్నారు.



## పైకాజి నగర్‌లో వీధి కుక్కల బెడద

**బెంబేలెత్తుతున్న కాలనీవాసులు!**

ఆసిఫాబాద్, ( వుదయం ప్రతినిధి ):

ఆసిఫాబాద్ పట్టణంలోని పైకాజి నగర్‌లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లే ప్రజలు కుక్కల కారణంగా ఆందోళనకు గురవుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులను కుక్కలు వెంబడిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో కుక్కల సంచారం పెరగడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైకాజి నగర్‌లో కుక్కల బెడదను నియంత్రించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులకు రక్షణ కల్పించేలా మున్సిపల్ అధికారులు ప్రజా భద్రత కు ప్రాధాన్యమిస్తూ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## కామారెడ్డిలో మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):-



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా పోలీస్ శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాన సందేశాన్ని చాటారు. రక్తదానం చేయండి – ప్రాణాలను కాపాడండి ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి, ఆపదలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలని (ఐ.ఎస్.ఆర్.డి) స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి అమృత రాజేందర్ పిలుపునిచ్చారు. మీ ఒక్క యూనిట్ రక్తం మరొకరికి కొత్త జీవితాన్ని అందించగలదన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్ అండతోనే ఫారెస్ట్ అధికారుల పాశవిక దాడులు

**భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్**

కోటపల్లి మండలం వుదయం



కోటపల్లి మండలం స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర మంత్రివర్యులు వివేక్ వెంకట్ స్వామి గారి అండదండలతోనే ఫారెస్ట్ అధికారులు గిరిజనులపై పాషవిక దాడులు చేస్తున్నారని భాజపా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు .

కోటపల్లి మండలం కావర్ కొత్తపల్లిలో దసిలీ పంట సాగు చేస్తున్న రైతుపై ఫారెస్ట్ అధికారులు ఇటీవల దాడి దాడి చేసి చితకబాదడంతో గాయపడిన ఆదివాసి రైతును మరియు ఆల్గాం గ్రామంలోఇటీవల ఫారెస్ట్ అధికారులు మేకల కాపరులను ఆదివాసులనీ కూడా చూడకుండా చితక బాదిన సంఘటనలో గాయపడ్డ బాధితులను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్ తో కలిసి బిజెపి జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 దశాబ్దాలుగా చెన్నూరు కేంద్రంగా అటవీ ప్రాంతంలో దసలి పంట సాగు జరుగుతుందని దసలి సాగుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ మరియు రాష్ట్ర ప్రభుత్వ టస్సర్ కార్యాలయాల పర్యవేక్షణలో సాగు జరుగుతుందని టాస్కర్ కార్యాలయంలోనే రైతులు పంటను విక్రయించడం జరుగుతుందని ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా ఫారెస్ట్ అధికారులు సుమారు 500 మంది ఆదివాసి రైతులను దసలి పంట సాగు చేయకుండా అడ్డుకోవడమే కాకుండా భౌతిక దాడులకు పాల్పడుతున్నారని.. ఫారెస్ట్ అధికారులు దాడికి గురి అయిన రైతువెంట ఆసుపత్రికి వెళ్ళినందుకు కక్ష సాధింపుగా పదిమంది రైతుల పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు.. ఫారెస్ట్ ఇలాంటి పాషవిక దాడులు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయకుండా వారికి ఈ రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వివేక్ వెంకట్ స్వామి గారు బాసటగా నిలవడం శోచనీయమని ఆయన అన్నారు ఇటీవల ఆల్ గ్రామ పరిధిలో అడవిలో మేకలను మేపుతున్న ఒక గిరిజన రైతుపై మరియు ఒక గొర్ల కాపరి పై ఫారెస్ట్ అధికారులు పాషవికంగా దాడి జరిపారని ఈ సంఘటనలో వారు కేసు నమోదు చేయకుండా ఫారెస్ట్ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడికి గురైన వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని... ఇదెక్కడి ప్రజాస్వామ్యం అని ఆయన ప్రశ్నించారు వివేక్ వెంకట్ స్వామి గారికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం రెండు సంఘటనలో బాధ్యులైన ప్రభుత్వ అధికారులపై సుమోటోగా కేసులు నమోదు చేసి తక్షణం వారిని విధుల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు స్వప్న పున్నం చంద్ భాజపా జిల్లా కార్యదర్శి మంత్రి సురేఖ రామయ్య బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెద్దింటి లక్ష్మణ్ గిరిజన మోర్చా నాయకులు ఆలం బాపుగారు చాకేటి శ్యామ్ గారు బిజెపి సీనియర్ నాయకులు కాసెట్టి నాగేశ్వర రావు గారు కోటపల్లి మండల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గూడెం సత్యదేవుని ఆలయంలో ఆశ్వీయుజ పౌర్ణమికి ఏర్పాట్లు

దండేపల్లి: అక్టోబర్ 24 (వుదయం విలేఖరి)



గూడెం శ్రీ సత్యదేవుని ఆలయంలో సోమవారం ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గూడెం గుట్టపై ఉన్న శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం యందు సోమవారం రోజున ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా శ్రీ స్వామి వారి వ్రతములు ఆచరించుటకు మరియు స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రతి పౌర్ణమి మాదిరిగానే తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేసారు,భక్తుల సౌకర్యార్థం దర్శనమునకు ఇబ్బంది కలగకుండా దేవస్థానం నుండి ప్రత్యేక క్యూలైన్స్ ఏర్పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించుట,లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయం,త్రాగు నీటి వసతి మొదలగు ఏర్పాట్లు చేసినట్లు ఇఓ పేర్కొన్నారు.

## త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలి



**రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసిన పౌర సరఫరాల శాఖ డైరెక్టర్**

కామారెడ్డి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):-

కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ అధ్యక్షతన బియ్యం సరఫరాపై రైస్ మిల్లర్లతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలు, సరఫరా ప్రక్రియను సమీక్షించారు. బియ్యం పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు పాల్గొన్నారు.

## పంట పొలాలకు వెళ్లే రోడ్డు కబ్జా

జన్నారం,అక్టోబర్ 24 (వుదయం విలేఖరి)



జన్నారం మండలంలోని రోటీగూడ గ్రామపంచాయతీలో ఓ వ్యక్తి పంట పొలాలకు వెళ్లే రోడ్డును కబ్జా చేశారని గతంలో అధికారులకు వెల్లడించినప్పటికీ ఇప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో గల సర్వే నెంబర్ 324 గల పొలాలకు వెళ్లడానికి ఉన్న రోడ్డు విస్తీర్ణాన్ని గ్రామంలోని మరొక వ్యక్తి కబ్జా చేసి పొలాన్ని సాగు చేస్తున్నాడని రైతు పులిశెట్టి వెంకటేష్ తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఇప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు.గత సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేశామని, ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# ఆదిలాబాద్ రాజకీయ ముఖచిత్రంపై బిగ్ బాంబ్



- గులాబీ గూటికి భార్గవ్ దేశ్‌పాండే.. జిల్లా పాలిటిక్స్‌లో కొత్త సమీకరణాలు!
- ఆదివారం మాజీ మంత్రి జోగు రామన్నతో భార్గవ్ ఉమ్మడి ప్రెస్ మీట్..

**ఆదిలాబాద్, వుదయం ప్రతినిధి, అక్టోబర్ 24:**

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు పొలిటికల్ హీట్ పీక్స్‌కు చేరింది! ఎక్కడ చూసినా ఒకే పేరు.. ఎక్కడ విన్నా ఒకటే చర్చ.. అదే భార్గవ్ దేశ్‌పాండే! ఇన్నాళ్లూ స్తబ్దుగా సాగిన జిల్లా రాజకీయాల్లో ఆయన నిర్ణయంతో ఒక్కసారిగా వేడి పెరిగింది. జిల్లా రాజకీయ సమీకరణాలను పూర్తిగా తలకిందులు చేసే ఒక భారీ వ్యూహానికి ఆదిలాబాద్ వేదిక కాబోతోంది. గత కొంతకాలంగా పొలిటికల్ సర్కిల్స్‌లో నడుస్తున్న ఉత్కంఠకు తెర దించుతూ.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ పిల్లర్, మాజీ డీసీసీ ప్రెసిడెంట్, మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పి కారెక్కేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ పొలిటికల్ సెన్సేషన్‌కు సంబంధించి ఆదివారం ఆదిలాబాద్ వేదికగా బీఆర్ఎస్ అగ్రనేత, మాజీ మంత్రి జోగు రామన్నతో కలిసి భార్గవ్ దేశ్‌పాండే నిర్వహించబోయే సంయుక్త ప్రెస్‌మీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. అసలు ఈ మార్పు వెనుక ఉన్న భార్గవ్ దేశ్‌పాండే రాజకీయ నేపథ్యం, ఆయనకున్న అసలు క్యాడర్ బలం ఏంటి?

**నిబద్ధత కలిగిన రాజకీయ ప్రస్థానం.. ఎదురైన చేదు అనుభవాలు!**

భార్గవ్ దేశ్‌పాండే అంటే ఆదిలాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న నేత. మాజీ ఎన్ఎస్‌యూఐ (NSUI) రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ, యువతను పార్టీ వైపు నడిపించిన ట్రాక్ రికార్డు ఆయనది. ఆ తర్వాత డీసీసీ అధ్యక్షుడిగా ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఆయన నిరంతరం శ్రమించారు. ఢిల్లీ స్థాయి కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు రాష్ట్ర సీఎం, పీసీసీ చీఫ్, సీనియర్ మంత్రులతో నేరుగా కనెక్ట్ కాగల రాజకీయ సత్తా ఆయన సొంతం. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన భార్గవ్, ఆ తర్వాత కూడా పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమించారు.

అయితే, పార్టీలోని కొందరు నాయకుల అంతర్గత విభేదాలు, కుమ్ములాటలు, కీలక సమయంలో ఆయనకు జరిగిన అన్యాయం, నాన్ కోఆపరేషన్ (సహకరించకపోవడం) ఆయనను తీవ్రంగా కలచివేశాయి. పార్టీ కోసం ఎంతగానో కష్టపడినప్పటికీ ఎదురైన చేదు అనుభవాలు, అవమానాల వల్లే ఆయన కాంగ్రెస్‌కు దూరం కావాల్సి వచ్చిందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**కంటికి రెప్పలా క్యాడర్ బలం.. అడుగులు వేసేందుకు సిద్ధమైన అనుచరులు!**

గత ఎన్నికల సమయంలో పార్టీ పరంగా కొన్ని ఒడిదొడుకులు ఎదురైనప్పటికీ.. భార్గవ్ దేశ్‌పాండే తన నమ్మకమైన క్యాడర్‌ను ఎక్కడా చెల్లాచెదురు కాకుండా, కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆయనకున్న ప్రజాదరణ, అపారమైన అనుచర బలం సామాన్యమైనది కాదు. కేవలం ఆయన ఒక్కరే కాకుండా, ఆయన వెనుక నడిచే కాంగ్రెస్ సీనియర్ ప్రజాప్రతినిధులు, మాజీ కౌన్సిలర్లు, కీలకమైన యువజన విభాగం అంతా భార్గవ్ బాటలోనే బీఆర్ఎస్ వైపు అడుగులు వేసేందుకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యారనే ప్రచారం సాగుతోంది. ఒక పవర్‌ఫుల్ మాస్ లీడర్ పార్టీని వీడటం కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో కోలుకోలేని దెబ్బ అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**డెలిమిటేషన్ మాస్టర్‌ప్లాన్.. భవిష్యత్తుపై గురిపెట్టిన రాజకీయ వ్యూహం!**

ఈ సంచలన మార్పు వెనుక రాబోయే రోజుల్లో ఉమ్మడి జిల్లా రాజకీయాల రూపురేఖలను మార్చేసే ఒక దీర్ఘకాలిక మాస్టర్ ప్లాన్ ఉందనేది ఇన్‌సైడ్ సోర్సెస్ ద్వారా అందుతున్న సమాచారం. దేశవ్యాప్తంగా భవిష్యత్తులో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని జోగు రామన్న, భార్గవ్ దేశ్‌పాండే ఒక వ్యూహాత్మక అడుగుతో ముందుకు సాగుతున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. డెలిమిటేషన్ తర్వాత ఆదిలాబాద్ అసెంబ్లీ స్థానం రెండుగా విడిపోయే అవకాశాలు ఉన్నాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆదిలాబాద్ టౌన్, రూరల్ పరిధులు రెండు వేర్వేరు నియోజకవర్గాలుగా రూపాంతరం చెందితే.. ఒక స్థానం నుంచి జోగు రామన్న, మరో స్థానం నుంచి భార్గవ్ దేశ్‌పాండే గులాబీ అభ్యర్థులుగా బరిలోకి దిగడానికి ఇప్పటి నుంచే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. భార్గవ్ దేశ్‌పాండేకు ఉన్న మాస్ లీడర్‌షిప్, బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జోగు రామన్నకు ఉన్న ప్రజాదరణ తోడైతే భవిష్యత్తులో ఈ సమీకరణాలు రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పొలిటికల్ అనలిస్టులు విశ్లేషిస్తున్నారు.

నవంబర్ 1న 'రైతు గర్జన'కు కౌంట్‌డౌన్!

హైదరాబాద్‌లో కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డిలతో జరిపిన చర్చలు సఫలం కావడం, ప్రెస్‌మీట్ ద్వారా భార్గవ్ ఇచ్చిన ముందస్తు సంకేతాలతో పాలిటిక్స్ మరింత హీటెక్కాయి. ఈ పొలిటికల్ వేవ్‌ను మరింత ముందుకు తీసుకెళ్తూ, నవంబర్ 1న ఆదిలాబాద్‌లో అత్యంత భారీ స్థాయిలో 'రైతు గర్జన' బహిరంగ సభను నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయి. ఈ సభకు కేటీఆర్ స్వయంగా హాజరవుతుండటంతో ఉమ్మడి జిల్లా అంతటా వలసల జోరు పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఆదివారం జరగబోయే ఈ ఉమ్మడి ప్రెస్‌మీట్.. ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఎలాంటి కొత్త మార్పులకు దారితీయబోతోందనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. భార్గవ్ దేశ్‌పాండే వెంట ఎంతమంది నాయకులు, కార్యకర్తలు నడుస్తారు? ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? బీఆర్ఎస్ బలం ఏ మేరకు పెరుగుతుంది? అన్న ప్రశ్నలకు రాబోయే పరిణామాలు సమాధానం చెప్పనున్నాయి.

## వినియోగదారుల కమిషన్‌కు కేటాయించిన ప్రత్యామ్నాయ భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

**కలెక్టర్‌కు రిజిస్ట్రార్ వై. సత్యేంద్ర విజ్ఞప్తి**

**మహబూబ్‌నగర్ , వుదయంప్రతినిధి**



మహబూబ్‌నగర్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ నిర్వహణకు ప్రత్యామ్నాయంగా కేటాయించిన భూగర్భ జల శాఖ కార్యాలయ భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే అంశంపై తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ రిజిస్ట్రార్, జిల్లా జడ్జి వై. సత్యేంద్ర శనివారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో సమావేశమయ్యారు. కమిషన్ కార్యకలాపాలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఆయన కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో సమావేశమైన వై. సత్యేంద్ర, వినియోగదారుల కమిషన్‌కు కేటాయించిన భవనంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. గతంలో వినియోగదారుల కోర్టు నిర్వహించిన భవనంలో ఉన్నట్లుగానే కొత్తగా కేటాయించిన ప్రత్యామ్నాయంగా భవనంలోనూ అన్ని అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తద్వారా కమిషన్ కార్యకలాపాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు వీలవుతుందని వివరించారు. దీనిపై కలెక్టర్ ఖుష్బూ గుప్తా సానుకూలంగా స్పందించారు. వినియోగదారుల కమిషన్ అధికారులతో సంప్రదించి, అవసరమైన సదుపాయాల కల్పనకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. అంతకుముందు రిజిస్ట్రార్ వై. సత్యేంద్ర, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కె. తిరుమాల రావు, సెక్షన్ ఆఫీసర్ పి. ప్రవీణ్ కుమార్, సూపరింటెండెంట్ సృజన కుమార్ తో కలిసి కమిషన్ నిర్వహణ కోసం కేటాయించిన భవనాన్ని సందర్శించి, అక్కడి పరిస్థితులను పరిశీలించారు.

## కామారెడ్డి జిల్లా చరిత్రలో మొదటిసారిగా 435 యూనిట్ల రక్తం సేకరణ

**జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రకి & జిల్లా పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలియజేసిన తలసేమియా సొసైటీ**

**కామారెడ్డి, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):-**



కామారెడ్డి జిల్లా కేంద్రంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం జిల్లా చరిత్రలో మొట్టమొదటిసారిగా 435 యూనిట్ల రక్తాన్ని సేకరించినందుకుగాను కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రకి తలసేమియా సికిల్ సెల్ పురస్కారాన్ని అందజేయడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు ఎండి జమీల్ అమ్మద్ లు తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, 2007 నుండి రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరిగిందని, ఇప్పటివరకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఎప్పుడూ కూడా 435 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరగలేదని ఈ రోజు చరిత్రలో కనివిని ఎరుగని విధంగా కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సహకారం, జిల్లా పోలీసు శాఖ యంత్రాంగం సహకారంతో తలసేమియా బాధిత చిన్నారుల కోసం, ప్రభుత్వ వైద్యశాలలో పేషంట్ల కోసం రక్తాన్ని సేకరించడం వారి కుటుంబాలకు ఎంతగానో తోడ్పడుతుందని, రక్తం దొరకక ఎంతోమంది తలసేమియా చిన్నారులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని వారి ప్రాణాలను కాపాడడం కోసం ఇంత గొప్ప కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్మెట్స్ ను అందజేసిన దాతలకు కృతజ్ఞతలను తెలియజేశారు. హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ వారి సహకారంతో రక్తదాతలకు పండ్లను పంపిణీ చేయడం జరిగిందని ఈ శిబిరానికి సహకరించిన కామారెడ్డి జిల్లా రక్తదాతలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మర్తిడి లో డ్రగ్స్, గంజాయి పై అవగాహన

**బెజ్జూర్ ఎస్.ఐ కే.రమేష్**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**



బెజ్జూర్ మండల పరిధిలోని మర్తిడి గ్రామంలో బెజ్జూర్ ఎస్.ఐ కే. రమేష్ ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి సాగు, వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గంజాయి సాగు చేయడం, విక్రయించడం, రవాణా చేయడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని, మత్తు పదార్థాల వినియోగం వల్ల ఆరోగ్యం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఎస్ఐ రమేష్ వివరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బెజ్జూర్ ఎస్ఐ కె. రమేష్ తో పాటు హెడ్ కానిస్టేబుల్ ఎస్. సమ్మయ్య, మహిళా పోలీస్ కానిస్టేబుల్ బి. కాంత పాల్గొన్నారు. గ్రామ పరిధిలో ఎవరైనా గంజాయి సాగు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె. రమేష్ తెలిపారు. గ్రామ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి సాగు, వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేసి, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## గొర్రెల మందపై వీధి కుక్కల దాడి

**సుమారు 30 గొర్రెలు మృతి.. మరో 20కు తీవ్ర గాయాలు**

**దుబ్బాక ప్రతినిధి , అక్టోబర్ 24, వుదయం:**



దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని ధర్మాజీపేటలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో సుమారు 30 గొర్రెలు మృతి చెందగా, మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. ఎడ్ల కాడి యాదయ్య కుటుంబ సభ్యులు రోజూ మాదిరిగానే శుక్రవారం సాయంత్రం గొర్రెలను మందలో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. ఈ దాడిలో సుమారు 30 గొర్రెలు మృతి చెందగా, మరో 20 గొర్రెలు తీవ్ర గాయాలతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## స్వర్ణకారుల బహిరంగ సభకు తరలిన జోగిపేట నాయకులు

**జోగిపేట, వుదయం:**



స్వర్ణకారుల సమస్యల పరిష్కారం, తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో నిర్వహించిన స్వర్ణకారుల బహిరంగ సభకు జోగిపేట పట్టణానికి చెందిన స్వర్ణకారులు రెండు బస్సుల్లో తరలివెళ్లారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అక్రమ కొనుగోళ్ల పేరుతో స్వర్ణకారులను వేధించకుండా తగిన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఈ బహిరంగ సభ నిర్వహించారు. స్వర్ణకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకోవడమే లక్ష్యంగా సభకు తరలివెళ్లినట్లు సభ్యులు తెలిపారు. జోగిపేట పట్టణ స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ చారి, యువజన అధ్యక్షుడు బాణాల ప్రవీణ్ చారి ఆధ్వర్యంలో సభ్యులు బాణాల రవి, గొట్టిముక్కల నారాయణ, శ్రీనివాస్, సంగమేశ్వర్, వెంకటేశం, నర్సింలు, వేణు, నాగేష్ తదితరులు బహిరంగ సభకు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

## రేపు విద్యాసంస్థలకు సెలవు

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి )**



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని విద్యాసంస్థలకు ఈనెల 26న సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కే .హరిత ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివాసి పోరాటయోధుడు కొమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కొమురం భీం వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు ఆదేశాలు పాటించాలని సెలవు ప్రకటించాలని సూచించారు.



## ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ

మరికల్ అక్టోబర్ 24 ( వుదయం ప్రతినిధి) ధన్వాడ మండల కేంద్రంలో శనివారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్యం పర్ణిక రెడ్డి గారి ఆదేశాల మీదకు ఇందిరమ్మ ఇల్లుకు భూమి పూజ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు చిట్టెం మాధవ రెడ్డి గ్రామ ఉపసర్పంచ్ పూజారి నరసింహులు మార్కెట్ కమిటీ డైరెక్టర్ జెడ్ ఎమ్ లక్ష్మయ్య గారు చిట్టెం రాఘవేందర్ రెడ్డి అచ్చిబాబు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఊర్కొండ మండలానికి 8 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

**అభివృద్ధిలో గ్రామాలను అగ్రగామిగా నిలుపుతున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి**

**ఊర్కొండ న్యూస్ 23వుదయం ప్రతినిధి**



కనీవినీ ఎరుగని రీతిలో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జననేత, అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి ఊర్కొండ మండలానికి అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు.. ఊర్కొండ మండలంలోని 16 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.8 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు MLA నిధులు మంజూరు చేయించారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మండలప్రజలధన్యవాదాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మండల కాంగ్రెస్ నాయకులు ఎంతో సంతోషించారు గ్రామ అభివృద్ధికి మేము ఎల్లప్పుడు ముందు ఉంటామని మరోసారి తెలియజేశారు.

## అమ్మాయిలకు ఉచిత కరాటే శిక్షణ

**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):**



అమ్మాయిల ఆత్మరక్షణ కోసం ఉచిత కరాటే శిక్షణ ఇవ్వనున్నట్లు కరాటే మాస్టర్ స్వాతి రవి ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 2వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభిస్తామని, హౌసింగ్ బోర్డ్, నేషనల్ మార్కెట్ పక్కన ఉన్న వాసవి డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ (పాత రవితేజ కాలేజ్ గ్రౌండ్) లో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. సెల్ఫ్ డిఫెన్స్, కర్రసాము, నాంచాక్, ఫైటింగ్ మూవ్‌మెంట్స్‌తో పాటు వివిధ రకాల ఫిట్‌నెస్ వ్యాయామాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అమ్మాయిలు ఆత్మవిశ్వాసంతో తమను తాము రక్షించుకునేలా ప్రత్యేక శిక్షణ అందిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు: 97030 47933 సంప్రదించాలని కోరారు.

## బీసీ,ఎస్సీ,ఎస్టీ,జేఏసీ ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

**జిల్లా కన్వీనర్ రాజశేఖర్, కో కన్వీనర్ బలిజ వీరేష్**

**నారాయణపేట టౌన్ అక్టోబర్ 24(వుదయం ప్రతినిధి)**




బీసీ, ఎస్సీ, ఎస్టీ–జేఏసీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ రాజశేఖర్ ముదిరాజ్ అడ్వకేట్, కో కన్వీనర్ బలిజ వీరేష్‌లు ఒక ప్రకటనలో కోరారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈనెల 25 ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు శ్రీ గాయత్రి ఫంక్షన్ హాల్ లో జరిగే ఆవిర్భావ సదస్సుకు బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలు ప్రజాస్వామ్య వాదులు, వివిధ కుల సంఘాల నాయకులు, విద్యాసంఘాల నాయకులు, విద్యావంతులు, మేధావులు, వివిధ పార్టీలో ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు అందరు పెద్ద సంఖ్యలో హాజరై సభ ను విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాలను ఒక వేదిక పైకి బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో తీసుకువచ్చి ఎవరికులమెంతో వారికి అంత వాటా, మన హక్కుల గురించి, రాజ్యంలో మన వాట గురించి మాట్లాడుకోవడానికి ఈ చర్చ వేదిక కు ప్రతి ఒక్కరు హాజరు కావాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ డా. విశారదన్ మహారాజ్ , విశిష్ట అతిథిగా మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్ రామయ్య యాదవ్ (ఉస్మానియా యూనివర్సిటీ),ప్రొఫెసర్ కుమారస్వామి (పాలమూరు యూనివర్సిటీ సోషియాలజిస్ట్) హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

## పేద యువత కలలకు పోలీస్ శాఖ చేయూత



- ఉచిత శిక్షణతో ఉద్యోగ సాధనకు బాటలు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి)**

జిల్లాలో పేద, ప్రతిభావంతులైన యువత పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యానికి ఆర్థిక పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సై, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని లైన్స్ క్లబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన శిక్షణ తరగతులను ప్రారంభించారు. పోలీస్ ఉద్యోగాల కోసం నిర్వహించిన అర్హత పరీక్షకు మొత్తం 413 మంది అభ్యర్థులు హాజరుకాగా, వారిలో ప్రతిభ ఆధారంగా 130 మంది మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా నాణ్యమైన బోధన, అవసరమైన స్టడీ మెటీరియల్‌తో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు ఫిజికల్ ఫిట్‌నెస్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతోమంది యువతకు పోలీస్ ఉద్యోగాలు సాధించాలనే పట్టుదల, ప్రతిభ ఉన్నప్పటికీ ప్రైవేట్ కోచింగ్ తీసుకునే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అలాంటి యువతకు సమాన అవకాశాలు కల్పించి, వారి ప్రతిభను వెలికితీసి, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవాలనే లక్ష్యంతో జిల్లా పోలీస్ శాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. యువతకు సరైన మార్గదర్శకత్వం, నాణ్యమైన శిక్షణ అందిస్తే వారు ఉన్నత లక్ష్యాలను సాధించగలరని ఎస్పీ పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో చదువుతూ ఉద్యోగ సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ, ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను పునశ్చరణ చేసుకోవాలని, మాక్ టెస్టుల ద్వారా తమ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవాలని తెలిపారు.

రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిజికల్ ఈవెంట్లలో అర్హత సాధించేందుకు నిరంతరం సాధన చేయాలని సూచించారు. పోలీస్ శాఖ కల్పిస్తున్న ఉచిత వసతి, బోధన, స్టడీ మెటీరియల్, ఫిట్‌నెస్ శిక్షణ వంటి సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు.

శిక్షణలో క్రమశిక్షణ, సమయపాలన అత్యంత ముఖ్యమని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎస్పీ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి ఉద్యోగ సాధనకు జిల్లా పోలీస్ శాఖ తనవంతు సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీలు మహేష్, నల్లపు లింగయ్య, కాజల్, సీఐలు శివ శంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సతీష్ రెడ్డి, నరేష్, ఎస్‌బీ ఎస్ఐ భాగ్య రెడ్డి, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దికుంటలో ఘనంగా దేవి నవరాత్రుల నిమజ్జనోత్సవం

- ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించిన సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు
- గ్రామ ప్రజల ఐకమత్యమే అభివృద్ధికి బాటలు వేస్తుంది: పులిమామిడి రాజు

**సదాశివపేట అక్టోబర్ 24 (వు ద యం):**



మద్దికుంట గ్రామంలో దేవి నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా నిమజ్జనోత్సవ మహోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవి సింగ్ పాల్గొన్నారు. లక్కీ డ్రాలో విజేతలకు సైకిల్ బహూకరణ దేవి నవరాత్రుల సందర్భంగా దుర్గామాత సన్నిధిలో భక్తుల కోసం గ్రామస్తులు ఏర్పాటు చేసిన లక్కీ డ్రాను పులిమామిడి రాజు చేతుల మీదుగా నిర్వహించారు. ఈ లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన మన్నె పద్మ–క్రిష్ణ దంపతులకు ఆయన సైకిల్‌ను బహూకరించారు. భక్తుల కోసం చక్కటి ఏర్పాట్లు చేసి, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన మద్దికుంట గ్రామస్తులను పులిమామిడి రాజు అభినందించారు. ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యం ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ ఒకే చోట చేరి ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఇలాంటి పండుగలు గ్రామ ప్రజల మధ్య సోదరభావాన్ని, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఐకమత్యంగా ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని, గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. దేవి నవరాత్రుల సందర్భంగా భక్తుల కోసం చక్కటి ఏర్పాట్లు చేసిన గ్రామస్తుల కృషి అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు ఐకమత్యంతో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దికుంట గ్రామ సర్పంచ్ దేవి సింగ్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ మమత, మాజీ ఉపసర్పంచ్ సుభాన్, జుట్టు హరిచందర్ రెడ్డి, కోలుకుంది వెంకట్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మాందాపురం విట్టల్, జగన్నాథ్ రెడ్డి, చెప్పు వెంకట్, బెలూరు వెంకట్ రెడ్డి, భవానీ మాత అసోసియేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గామాత నామస్మరణలు, భక్తుల సందడి మధ్య నిమజ్జనోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్‌హౌస్ పోలీస్ విధులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన



**దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 24 వుదయం:**

పోలీసుల విధులు, చట్టాలపై అవగాహనతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని మిరుదొడ్డి ఎస్ఐ సతీష్ విద్యార్థులకు సూచించారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరు, స్టేషన్ నిర్వహణ, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, వాటి పర్యవసానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే స్పందించాలని సూచించారు. తప్పుడు సమాచారాన్ని ఇతరులకు పంపించడం వల్ల అనవసర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్రిమినల్ కేసుల నమోదు, ఫిర్యాదుల స్వీకరణ, దర్యాప్తు ప్రక్రియ, చట్టపరమైన అంశాలను విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతాల సమాచారం, ఓటీపీని ఇతరులకు వెల్లడించవద్దని తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుళ్లు రవి, తిరుపతి, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది రాజలక్ష్మి , రేణుక, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పంపిణీ



మాగనూర్ అక్టోబర్ , 24 (వుదయం న్యూస్)

మాగనూరు మండలం వడ్వాట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఎనిమిది మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి, గ్రామ సర్పంచ్ జి. రవీందర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారంతో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల సదుపాయం కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఎస్. కళ్యాణి, గ్రామ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ నియోజకవర్గ పత్తి రైతులను ఆదుకోవాలి

**వై. నరోత్తం డిమాండ్**

(నాల్కకల్ వుదయం ప్రతినిధి అక్టోబర్ 25)

జహీరాబాద్ నియోజకవర్గం లో పత్తి పంట పొలాలను పరిశీలించిన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం గారు. ఈ సందర్భంగా పత్తి పంట పరిస్థితిని,దిగుబడి అవకాశాలను, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రైతులతో మాట్లాడి తెలుసుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ,ప్రతికూల వాతావరణ పరిస్థితులు, దిగుబడుల తగ్గుదల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా జహీరాబాద్ ప్రాంతంలో పత్తి రైతులకు సాగు ఖర్చులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని అన్నారు

గత ఏడాది తెలంగాణలో సుమారు 44.75 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఎకరాకు సగటున 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతుల అంచనా. ఈ ఏడాది పత్తి సాగు విస్తీర్ణం సుమారు 45.95 లక్షల ఎకరాలకు పెరిగినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరాకు సగటున 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. దుక్కులు దున్నడం,విత్తనాలు, ఎరువులు,పురుగుమందులు, ఇతర వ్యవసాయ పనులు, పత్తి ఏరడం తదితర ఖర్చులు కలిపి ఎకరాకు సుమారు రూ.48,000 అవుతున్నాయి ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. పత్తి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్. రైతులు పంట పండించడానికి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, చివరకు నష్టాలతో అప్పులపాలయ్యే పరిస్థితి ఏర్పడటం ఆందోళనకరమని . పత్తి రైతుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, జహీరాబాద్ ప్రాంతంలోని వేలాది రైతు కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్,యం. మల్లేశం,వీర్ సంగప్ప.చెంగల్ జైపాల్,లక్ష్మి నారాయణ,బి. తుక్కన్న, యం.డి.రైసోద్దీన్, బి.రాములు,కే.మల్లేశం, తదితరులు ఉన్నారు.



## ఇందిరాగాంధీ విగ్రహం ఎత్తుకెళ్లారని ఫిర్యాదు

- మరో వర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులపై రఘువర్ధన్ రెడ్డి ఆరోపణ
- బాధ్యులపై కేసు నమోదు చేయాలని డిమాండ్

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 24, వుదయం:



దుబ్బాకలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉంచిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని కొంత మంది కాంగ్రెస్ నాయకులు అక్కడి నుంచి ఎత్తుకెళ్లారని కాంగ్రెస్ నాయకుడు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై బాధ్యులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ కీర్తి రాజుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ విగ్రహాలు ధ్వంసం కావడంతో వాటి స్థానంలో నూతన విగ్రహాలను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో విగ్రహాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేయగా, ఈ నెల 24వ తేదీ సాయంత్రం కొంతమంది కాంగ్రెస్ నాయకులు దానిని అక్కడి నుంచి తీసుకెళ్లారని ఆరోపించారు. మాజీ ప్రధానుల విగ్రహాల ఏర్పాటుకు తాము కృషి చేస్తుంటే, అదే పార్టీకి చెందిన మరో వర్గం నాయకులు విగ్రహాన్ని తీసుకెళ్లడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి, బాధ్యులపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రఘువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో దుబ్బాకకు రూ.14.30 కోట్లు.. 8 చిన్న వంతెనలకు నిధుల మంజూరు

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 24, వుదయం:



దుబ్బాక నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రహదారులపై 8 చిన్న వంతెనల నిర్మాణానికి ప్రభుత్వం రూ.14.30 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి చొరవతో ఈ నిధులు మంజూరు కావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో వంతెనల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. దీనికి స్పందించిన ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. భూంపల్లి–లింగుపల్లి రోడ్డుపై వంతెనకు – రూ.2.10 కోట్లు, రుద్రారం–ఖాజీపూర్–కల్వకుంట రోడ్డుపై వంతెనకు – రూ.1.90 కోట్లు, భూంపల్లి–దొమ్మాట రోడ్డుపై రెండు వంతెనలకు – రూ.3.20 కోట్లు, మెట్టు–దౌల్తాబాద్ రోడ్డుపై మూడు వంతెనలకు – రూ.5.35 కోట్లు, లీడ్ రోడ్డు–చందాపూర్ రోడ్డుపై వంతెనకు – రూ.1.75 కోట్లు మంజూరు కావడం జరిగింది. ఈ వంతెనల నిర్మాణంతో వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయి, రైతులు, విద్యార్థులు, రోగుల రవాణాకు ఎంతో మేలు జరగనుంది. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి పలువురు నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## జహీరాబాద్ ఏఎంసీ చైర్మన్ పదవి మైనారిటీలకు కేటాయించాలి

**కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ షంషేర్ అలీకి అవకాశం కల్పించాలి**

కోహిర్, అక్టోబరు 24(వుదయం ప్రతినిధి):





జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నూతన చైర్మన్ పదవిని మైనారిటీలకు కేటాయించి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ షంషేర్ అలీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ అతీఖ్ పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీలకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా నాయకత్వం నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో నూతన కమిటీ నియామకంలో మైనారిటీలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మహమ్మద్ అతీఖ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, విజయానికి మహమ్మద్ షంషేర్ అలీ చేసిన సేవలను గుర్తించి, ఆయనకు చైర్మన్ పదవి కల్పించాలని కోరారు. గతంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కేటాయింపులో ముస్లిం మైనారిటీలకు తగిన ప్రాతినిధ్యం లభించలేదనే అసంతృప్తి వర్గాల్లో ఉందని మహమ్మద్ అతీఖ్ తెలిపారు. ఈసారి కూడా నామినేటెడ్ పదవుల భర్తీలో మైనారిటీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోతే పార్టీపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీల మద్దతు కాంగ్రెస్ పార్టీకి కీలకమని పేర్కొంటూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన సీనియర్ నాయకులను గుర్తించడంతో పాటు మైనారిటీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు. అలా చేయడం ద్వారా పార్టీ నాయకత్వంపై వారికున్న విశ్వాసం మరింత బలపడుతుందని అన్నారు.

రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర స్థాయి నాయకత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని మహమ్మద్ అతీఖ్ విజ్ఞప్తి చేశారు.

పార్టీ క్రమశిక్షణను కాపాడుతూ కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకులకు తగిన గుర్తింపు ఇవ్వాలని ముస్లిం నాయకులు, జహీరాబాద్ ప్రజలు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. నూతన ఏఎంసీ కమిటీ నియామకంలో మహమ్మద్ షంషేర్ అలీకి అవకాశం కల్పించి, మైనారిటీలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వైభవంగా సంగారెడ్డి సాయిబాబా ఆలయ రజతోత్సవాలు



**శిఖర కుంభాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన నిర్మల జగ్గారెడ్డి**

సంగారెడ్డి వుదయం

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సాయిబాబా ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో మూడు రోజులపాటు యజ్ఞయాగాదులు, కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. కూకట్‌పల్లికి చెందిన నరేష్ పంతులు నేతృత్వంలో 30 మంది వేద పండితులు ఈ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటి రోజు సుదర్శన యాగం, రెండో రోజు శత కలశాభిషేకం, మూడో రోజు శిఖర కుంభాభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మూడో రోజు జరిగిన శిఖర కుంభాభిషేకంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్యులు టీ. కాశప్ప, కేవీ నర్సయ్య, ఎస్. వీరేందర్, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మాటపాటలతో ఎల్‌నినోపై ప్రజలకు అవగాహన

**శివాజీ చౌరస్తాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ప్రదర్శన**

దౌల్తాబాద్ అక్టోబర్ 24(వుదయం)



దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో ప్రజలు, రైతులు, విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఎల్‌నినో ప్రభావం, నీటి సంరక్షణ, విద్యుత్తు పొదుపు, ఆరుతడి పంటల సాగు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జూరి రవికుమార్ ఆదేశాల మేరకు దుబ్బాక టీమ్ ఆధ్వర్యంలో మాటలు, పాటల రూపంలో ప్రజలకు సందేశాలు అందించారు.

**నీరు, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలి**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే నేపథ్యంలో సాగునీరు, తాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కళాకారులు సూచించారు. రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా ఆరుతడి పంటలు సాగు చేయాలని, భూసారాన్ని కాపాడుకుంటూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని పాటల ద్వారా వివరించారు. విద్యుత్తును అవసరమైన మేరకే వినియోగిస్తూ వృథాను అరికట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దుబ్బాక తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం టీమ్ లీడర్ బిట్ల ఎల్లయ్యతోపాటు ఆస రామారావు, కమ్మరి నర్సయ్య, పిల్లుట్ల ప్రకాశ్, జినుక దేవదాసు, తుమ్మల ఎల్లయ్య, సందుర్ల శేఖర్ తమ ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణకారుల డిమాండ్లను పరిష్కరించాలి

- స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి
- స్వర్ణకారుల పాలకమండలి ఏర్పాటు చేయాలి



నాగర్ కర్నూల్, అక్టోబర్ 23 (వుదయం బ్యూరో):

హైదరాబాద్ సరూర్ నగర్ మైదానంలో శనివారం నిర్వహించే స్వర్ణకార శంఖారావం భారీ బహిరంగ సభకు నాగర్ కర్నూల్ నుంచి స్వర్ణకారులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్వర్ణకార సంఘం నాయకులు మాట్లాడుతూ, తమ న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. స్వర్ణకారుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే పాలకమండలి నియమించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 272 ను సవరణ చేసి అమలు పరిచి, స్వర్ణకారుల పట్ల జరుగుతున్న అక్రమ రికవరీలను అరికట్టాలన్నారు. 50 సంవత్సరాలు పైబడిన స్వర్ణకార వృత్తిదారులకు నెలకు 5000 రూపాయల పెన్షన్ అమలు చేయాలని కోరారు. అదేవిధంగా అన్ని బ్యాంకులలో అప్రైజర్లకు ఉన్న సీలింగ్ విధానాన్ని తొలగించి, సమాన కమిషన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. శంఖారావానికి మద్దతుగా జిల్లా కేంద్రంలోని బంగారుదుకాణాలను బందు చేసినట్లు బులియన్ మర్చంట్ అధ్యక్షులు అలంపల్లి రమేష్ తెలిపారు. నాగర్ కర్నూల్ మున్సిపల్ కౌన్సిలర్లు జయలక్ష్మి నగేష్ చారి, జయప్రకాష్ చారి, నాగర్ కర్నూల్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి కొండోజు రవీంద్ర చారి, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు , కేశవా చారి తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల్లో పాల్గొన్న సంగారెడ్డి

**జిల్లా డీసీసీ అధ్యక్షులు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి**

వుదయం మనూరు, అక్టోబర్: 24



మనూర్ మండలం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంజీవ్ సంగామణి గార్లు నిన్న రాత్రి తుల్జాపూర్ భావనమ్మ గుడికి వెళుతున్న వారి కార్ యాక్సిడెంట్ లో మాజీ సర్పంచ్ దంపతులు ఇద్దరూ మరణించినారు. వారి కుమారులు కోడలు మనవడి గాయపడి ఉన్నారు ఈ విషయం తెలుసుకొని వారి అంత్యక్రియలకు హాజరై వారికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యాన్ని చెప్పిన సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు పట్లోల చంద్రశేఖర్ రెడ్డి వారితోపాటు మండలం నాయకులు సర్పంచ్‌లు గ్రామస్తులు.తదితరులు ఉన్నారు.

## సంగారెడ్డి కర్ణాటకలో రోడ్డు ప్రమాదం మనూరు వాసులు మృతి

వుదయం మనూరు, అక్టోబర్, 24




ప్రమాద వివరాలు కర్ణాటకలో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదం మనూరు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతులు: మనూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సంజీవ్ మరియు ఆయన భార్య సంగీత ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఘటన ఎలా జరిగింది: వీరు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం మహారాష్ట్రలోని తుల్జాపూర్ పుణ్యక్షేత్రానికి కారులో వెళుతుండగా, కర్ణాటకలోని బసవకల్యాణ్ సమీపంలో ఈ ప్రమాదం సంభవించింది. గాయపడినవారు: ఈ ఘటనలో మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో విషాదం: దంపతుల మృతితో మనూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## స్థానిక రైస్ మిల్ యాజమానులపై చర్యలు తీసుకోవాలి

**ఇతర జిల్లాల వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయకుండా అడ్డుకోవడం సరికాదు**

దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 24, వుదయం:



దుబ్బాక ప్రాంతంలో ఇతర జిల్లాల వ్యాపారులు వచ్చి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా స్థానిక రైస్ మిల్ యాజమానులు అడ్డుకోవడాన్ని రైతు నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దుబ్బాక పట్టణంలో రైతు నాయకులు మీడియాతో మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న స్థానిక రైస్ మిల్ యాజమానులపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దుబ్బాక ప్రాంత రైస్ మిల్ యాజమానులు తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని రైతు నాయకులు ఆరోపించారు. ఇతర జిల్లాల వ్యాపారులు పోటీగా కొనుగోలు చేయడానికి వస్తే రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని, అయితే వారిని అడ్డుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రైతులను మోసం చేస్తున్న రైస్ మిల్ యాజమానులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతు నాయకులు తౌడ శ్రీనివాస్, ఎంగారి రాజిరెడ్డి, తుక్కయ్య గారి రాజిరెడ్డి, అంబటి యాదగౌడ్, సత్తు శ్రీనివాస్ రెడ్డి, దోరగొల్ల మహేశ్, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.



## మహిళను లైంగికంగా, మానసికంగా వేధించిన వ్యక్తి అరెస్ట్

**జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలింపు.. ఎస్ఐ సతీష్**

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), అక్టోబర్ 24, వుదయం:

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా, మానసికంగా వేధింపులకు పాల్పడిన వ్యక్తిని మిరుదొడ్డి పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు అక్బర్‌పేట–భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన పోతారం రాజుపై కేసు నమోదు చేసి, శనివారం అరెస్ట్ చేసినట్లు మిరుదొడ్డి ఎస్ఐ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వారిని లైంగికంగా, మానసికంగా వేధించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవిస్తూ, వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.



## మాగనూర్ నూతన ఎస్ఐగా మహేందర్ రెడ్డి

మాగనూర్ అక్టోబర్ , 24 (వుదయం న్యూస్)

మాగనూర్ పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా కె. మహేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో జోగులాంబ గద్వాల జిల్లా టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై మాగనూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మహేందర్ రెడ్డి, తన నియామకానికి సంబంధించిన వివరాలను తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహేందర్ రెడ్డి తెలిపారు.



## ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక అభిషేకం

**స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి**

తాండూరు, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):

తాండూరు పట్టణంలోని సాయిపూర్‌లో కొలువుదీరిన శ్రీ ప్రసన్న అభయ ఆంజనేయ స్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక అభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా బాల్ రెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదమంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాల మధ్య స్వామివారికి అభిషేకం నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆంజనేయ స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, తాండూరు ప్రాంతం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ప్రార్థించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతోపాటు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ కార్యక్రమంలో భక్తులు వాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## పీసీఎస్ఏపీ ద్వారానే వరి ధాన్యం కొనుగోళ్లు

**రైతులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాలను సిద్ధం చేయాలి: అదనపు కలెక్టర్ చెన్నయ్య**

నాగర్ కర్నూల్, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):



జిల్లాలో 2026–27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లను ప్రొక్యూర్‌మెంట్ సెంటర్ సెల్ఫ్ అసెస్ మెంట్ పోర్టల్ (PCSAP) ద్వారానే నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని సమీక్ష సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 20 మండలాల పరిధిలో 183 కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, రైతులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి, చెత్త, తాలు, మట్టి, రాళ్లు లేకుండా శుభ్రపరిచి తీసుకురావాలని, తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్ లో గ్రేడ్–ఏ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 కనీస మద్దతు ధరగా నిర్ణయించినట్లు, ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్న రకాలకు క్వింటాలుకు రూ.500 అదనపు బోనస్ ఇస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలు, తేమ మీటర్లు, టార్పాలిన్లు, తాగునీరు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, ప్రతి కేంద్రాన్ని జియో ట్యాగింగ్ చేసి వివరాలు PCSAP పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ధాన్యం రవాణా, నిల్వకు గిడ్డంగులను సిద్ధం చేయాలని సూచించారు.

సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల ఇన్ చార్జీలు, మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెన్షన్ లబ్ధిదారుల వెరిఫికేషన్.. పాఠశాలలు, పీహెచ్‌సీ తనిఖీ

**ఎల్‌నినో ప్రభావాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు**

ధరూర్, అక్టోబర్ 24 (వుదయం కరస్పాండెంట్)



ధరూర్ మండలంలోని వామనపల్లి, ఉప్పేరు, ఖమ్మంపాడు, గార్లపాడు గ్రామాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగ్ రావు పర్యటించి పలు ప్రభుత్వ సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ నిర్వహించి, అర్హులకు పింఛన్లు అందుతున్న తీరును సమీక్షించారు. అనంతరం ఉప్పేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) తనిఖీ చేశారు. ఉప్పేరు జడ్పీహెచ్ఎస్‌తో పాటు గార్లపాడు పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధనా విధానం, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఎల్‌నినో పరిస్థితులు, వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ రంగంపై పడే ప్రభావాల గురించి వివరించారు. నీటి వృథాను అరికట్టి, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు, వ్యవసాయ ప్రణాళికలను రూపొందించుకోవాలని రైతులకు అవగాహన కల్పించారు.

## ప్రశాంత వాతావరణంలో ముగిసిన అసిస్టెంట్ సైంటిస్ట్ పరీక్ష

**పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ పాండు**

సంగారెడ్డి జిల్లా ప్రతి నిధి , అక్టోబర్ 24: వుదయం



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్–II) పోస్టుల భర్తీకి శనివారం నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBRT) ప్రశాంత వాతావరణంలో ముగిసింది. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పాండు తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించి, అభ్యర్థుల హాజరు, బయోమెట్రిక్ హాజరు నమోదు, సీసీ కెమెరాల పనితీరుపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేసి అనుమతించడం, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష హాల్లోకి అనుమతించకుండా చర్యలు తీసుకోవడంపై ఆరా తీశారు. అభ్యర్థులకు తాగునీరు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తు.చ. తప్పకుండా పాటిస్తూ, పరీక్షలు సజావుగా జరిగేలా పర్యవేక్షించాలని నిర్వాహకులకు సూచించారు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకు నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించగా, మొత్తం 150 మంది అభ్యర్థులకు గాను 89 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

## పోలీసుల విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన

- పోలీస్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఓపెన్ హౌస్ కార్యక్రమం
- ఆల్మాస్ హైస్కూల్ విద్యార్థులకు కరణ్‌కోట్ పోలీసుల అవగాహన
- కరణ్ కోట్ ఎస్ హెచ్ ఓ డి అన్వేష్ కుమార్ రెడ్డి



తాండూర్ అక్టోబర్ 24, (వుదయం ప్రతినిది )

పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, పోలీసుల విధులు, బాధ్యతలు, పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కరణ్‌కోట్ పోలీసుల శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆల్మాస్ హైస్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరణ్‌కోట్ ఎస్‌హెచ్‌ఓ డి. అన్వేష్ రెడ్డి విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ విధులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే విధానం, వాటిపై తీసుకునే చర్యలు, కేసుల విచారణ, శాంతిభద్రతల పరిరక్షణ వంటి అంశాలను వివరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను ఎలా సంప్రదించాలి, ఫిర్యాదు చేసే సమయంలో అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.

పోలీసులు కేవలం నేరాలను అరికట్టడానికే కాకుండా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, బాధితులకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని వివరించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు క్రమశిక్షణ, చట్టాల పట్ల గౌరవం, సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా పోలీస్ వ్యవస్థ పనితీరుపై విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడంతో పాటు, పోలీసుల పట్ల ఉన్న సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పవన్, కానిస్టేబుల్ అనిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యం అందించాలి

- పీఎం రాహత్ పథకం కింద ఆసుపత్రుల నమోదు వేగవంతం చేయాలి
- ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 23 (వుదయం బ్యూరో):**



రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్యసేవలు అందించాలని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకం కింద ఆసుపత్రుల నమోదును వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం రాహత్ పథకం అమలుపై వివరించారు. ఈ కాన్ఫరెన్స్ లో నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పీఎం రాహత్ పథకం కింద వైద్యసేవలు అందించేందుకు 40 ఆసుపత్రులను గుర్తించి అనుమతులు కల్పించాలన్నారు. ఎన్ఐసీ ద్వారా ఆన్ లైన్ లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పథకం కింద బాధితులకు గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం అందుతుందని, దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని, 24 గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకం దుర్వినియోగం కాకుండా పోలీస్, ఆర్ అండ్ బీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పర్యవేక్షణ చేపట్టాలన్నారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, ఆర్ అండ్ బీ ఈఈ శ్రీధర్, ఎన్ఐసీ కోఆర్డినేటర్లు హర్షద్, మధు, ఆర్టీఓ అధికారులు పాల్గొన్నారు.

# పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, అక్టోబర్ 24:-వుదయం.**



రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించి, ప్రాణాలను కాపాడే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రి చికిత్స, భరోసాతో కూడిన వైద్య సేవలు అందించే పీఎం రాహత్ పథకం అమలు తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాద బాధితులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు దూరం కాకుండా, వారికి తక్షణమే అవసరమైన వైద్య సేవలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. పథకం నిబంధనలకు అనుగుణంగా నిర్దేశిత ఆసుపత్రుల్లో చికిత్స అందించాలన్నారు. ప్రమాద బాధితుల వివరాల ధ్రువీకరణ కోసం ఆసుపత్రుల నుంచి వచ్చే అభ్యర్థనలపై పోలీసులు వెంటనే స్పందించి, నిర్ణీత సమయంలో ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. దీనివల్ల బాధితులకు వైద్య సేవలు అందించడంలో జాప్యం నివారించవచ్చన్నారు. పీఎం రాహత్ పథకం కింద ఆసుపత్రులు సమర్పించే చికిత్స ఖర్చుల క్లెయిమ్‌లను జిల్లా కలెక్టర్లు సంబంధిత పోర్టల్ ద్వారా క్రమం తప్పకుండా పరిశీలించాలని, పథకం మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పథకం అమలులో వైద్య, పోలీసు, ఇతర సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జూరాల రికార్డులకు నిప్పు!

- ఎస్ఈ కార్యాలయంలో దస్త్రాల దహనం కలకలం
- ప్రాజెక్టు నిర్మాణం నాటి పత్రాలు బుగ్గిపాలైనట్లు సమాచారం
- ఉద్యోగిపై ఆరోపణలు.. పోలీసులకు ఫిర్యాదు?

**గద్వాల అక్టోబర్ 24 (వుదయం బ్యూరో)**



జూరాల ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) కార్యాలయంలో పాత రికార్డుల దగ్ధం వ్యవహారం కలకలం రేపుతోంది. ప్రాజెక్టు నిర్మాణం నాటి నుంచి భద్రపరిచిన దస్త్రాల్లో కొన్ని పత్రాలను ఓ ఉద్యోగి కాల్చివేసినట్లు ఆరోపణలు రావడం సంచలనంగా మారింది. ప్రభుత్వ రికార్డుల భద్రతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దస్త్రాలు దగ్ధం.. ఎన్నో సందేహాలు! జూరాల ప్రాజెక్టుకు సంబంధించిన పాత రికార్డుల్లో కొన్ని పత్రాలను గురువారం దగ్ధం చేసినట్లు సమాచారం. అయితే అవి ఏయే విభాగాలకు సంబంధించినవి? వాటిలో ఎలాంటి కీలక సమాచారం ఉంది? ఎంతమేర పత్రాలు కాలిపోయాయి? వాటిని తొలగించేందుకు నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానాలు తెలియాల్సి ఉంది. ఈ వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. నిబంధనలు పాటించారా? ప్రభుత్వ కార్యాలయాల్లోని పాత రికార్డులను తొలగించేందుకు నిర్దిష్ట విధివిధానాలు ఉంటాయి. సంబంధిత అధికారుల అనుమతులు, రికార్డుల ప్రాధాన్యంపై పరిశీలన, నిబంధనల ప్రకారం తొలగింపు వంటి అంశాలు కీలకం. ఈ నేపథ్యంలో జూరాల ఎస్ఈ కార్యాలయంలో జరిగిన ఘటనలో నిబంధనలు పాటించారా? ఉన్నతాధికారులకు ముందస్తు సమాచారం ఉందా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. ఉన్నతాధికారులు స్పందించేనా?

ప్రభుత్వ రికార్డుల దగ్ధంపై ఫిర్యాదు అందినట్లు సమాచారం నేపథ్యంలో పోలీసుల విచారణ ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా మారింది. దగ్ధమైన పత్రాలను గుర్తించి, ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించి, అసలు వాస్తవాలను వెలికితీయాల్సిన అవసరం ఉంది. మరోవైపు శాఖాపరంగా కూడా సమగ్ర విచారణ జరిపి, బాధ్యుల పాత్రపై స్పష్టత తీసుకురావాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రికార్డుల దగ్ధం వెనుక కారణాలేంటి? కీలక ప్రాజెక్టుకు సంబంధించిన పాత దస్త్రాలు దగ్ధమైనట్లు ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదు. అయితే ఈ ఘటన వెనుక ఉద్దేశం ఏమిటన్నది ఆధారాలతోనే నిర్ధారించాల్సి ఉంటుంది. ఆరోపణలను నిర్ధారించకుండా ఎవరినీ దోషిగా పేర్కొనలేం. ఉన్నతా ధికారులు పారదర్శక విచారణ చేపట్టి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? అన్నది వేచి చూడాలి.

# నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలి



**ప్రజా పోరాటాలు ఉధృతం చేయాలి: సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు**

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, దీనికోసం ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే చలో హైదరాబాద్ మల్టిపుల్ డేస్ మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 29 చట్టాలుగా మార్చి 4 లేబర్ కోడ్ లుగా తెచ్చి ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తోందని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా అడ్డుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపు రెండు కోట్ల మంది అసంఘటిత కార్మికులు కలిసి పోరాడాల్సిన తరుణం ఆసన్నమైందని, కాంట్రాక్ట్ విధానంలో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. కేంద్రం ఏకపక్షంగా తెచ్చిన లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేసి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిలి రామయ్య, బాలకృష్ణమ్మ, రేణుక, రాధా కృష్ణమ్మ, అనిత, రాణి, శోభ, భాగ్యమ్మ, సాహితి, వెంకటమ్మ, కృష్ణమ్మ, ఆలివేల, జాఫర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు ప్రశంసనీయం

- కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ 28వ వార్షికోత్సవంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి
- మారుమూల ప్రాంతాల్లో సేవలు అభినందనీయం: కలెక్టర్ హేమంత్ పాటీల్

**నాగర్ కర్నూల్ రూరల్, అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి):**

గ్రామీణ ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలు అందించడంలో కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్ స్టిట్యూట్ అనుబంధంగా నిర్వహిస్తున్న కూచుకుళ్ల రామచంద్రారెడ్డి ఐ సెంటర్ 28వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, 28 ఏళ్లుగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన నేత్ర వైద్య సేవలను అందించడంలో ఐ సెంటర్ కీలక పాత్ర పోషిస్తోందని, తన తండ్రి పేరుతో నిర్వహిస్తున్న కేంద్రం ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరడం సంతృప్తినిస్తోందని అన్నారు. సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ హేమంత్ పాటీల్ మాట్లాడుతూ, కంటి చూపు ప్రతి మనిషి జీవితంలో ఎంతో విలువైనదని, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగిని నగదు బహుమతి, ప్రశంసాపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, తహసిల్దార్ తబితా రాణి, సర్పంచ్ లక్ష్మి, కరుణాకర్ రెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పురిట్లోనే పసిగుడ్డపై మృత్యు నీడలు!

- జోగులాంబ గద్వాల సర్కారు దవాఖానాలో దారుణమైన పారిశుద్ధ్య లోపాలు
- దుమ్ము, ధూళి.. తుప్పు మంచాల మధ్యే నవజాత శిశువులు, బాలింతల నరకయాతన
- నిద్రమత్తులో యంత్రాంగం.. నిరుపేదల ప్రాణాలతో చెలగాటం

**గద్వాల అక్టోబర్ 24 (వుదయం బ్యూరో)**



పేదలకు ఉచిత వైద్యం అందించి పునర్జన్మ ప్రసాదించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రులు.. నేడు నిర్లక్ష్యానికి, అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లా జనరల్ ఆసుపత్రిలో పారిశుద్ధ్య లోపాలు హద్దులు దాటాయి. అప్పుడే జన్మించి, లోకంలోకి అడుగుపెట్టిన పసికందులు, ప్రసవవేదన నుంచి ఇంకా కోలుకోని బాలింతల ప్రాణాలతో సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది నిస్సిగ్గుగా చెలగాటమాడు తున్నారు. కనీస పరిశుభ్రత లేని నరకప్రాయమైన వాతావరణంలో తల్లీబిడ్డలను ఉంచుతుండటంతో రోగుల బంధువుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దుమ్ము ధూళి మధ్యే పసికందుల ప్రయాణం.. ప్రసవం తర్వాతి తొలి రోజులు తల్లికి, బిడ్డకు అత్యంత కీలకమైనవి. ముఖ్యంగా నవజాత శిశువులు ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలి. అలాంటిది పసికందులు ఉండే ప్రసవానంతర వార్డు అంతా దుమ్ము, ధూళితో నిండిపోయి దర్శనమివ్వడం ఆందోళనకరం. ఈ అపరిశుభ్ర వాతావరణం కారణంగా చిన్నారులకు శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, ప్రాణాంతక వ్యాధులు సోకే ముప్పు పొంచిఉన్నా.. అధికారుల్లో మాత్రం కనీస స్పందన కరువైంది. మార్చని మురికి బెడ్‌షీట్లు.. తుప్పు పట్టిన మంచాలు! రోగులకు విశ్రాంతినివ్వాల్సిన పడకలు క్షీణదశకు చేరాయి. ఎప్పటికప్పుడు మార్చాల్సిన బెడ్‌షీట్లు మురికివాసన కొడుతుండగా, పడుకునే మంచాలపై తుప్పు మరకలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కనీసం నేలను శుభ్రం చేసే నాథుడు కూడా లేకపోవడంతో ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ ఏ స్థాయికి దిగజారిందో ఇట్టే అర్థమవుతోంది. రోగులకు రక్షణగా నిలవాల్సిన వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించేదెవరూ? ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలతో పాటు పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిబంధనలు ఘోషిస్తున్నా.. గ్రౌండ్ లెవల్‌లో మాత్రం పరిస్థితులు అందుకు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయి. వార్డుల్లో నెలకొన్న ఈ క్షీణించిన పరిస్థితులపై రోగుల బంధువులు కన్నీటిపర్యామయమవు తున్నా అధికారుల గుండెల్లో చలనం లేదు. ఉన్నతాధికారులు ఇకనైనా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, వాస్తవ పరిస్థితు లను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా కళ్లు తెరవాల్సిందే!

తక్షణ శానిటైజేషన్: ప్రసవానంతర వార్డును వెంటనే పూర్తిస్థాయిలో క్రిమిసంహారక మందులతో శానిటైజేషన్ చేయించాలి.

పడకల మార్పు: మురికిపట్టిన బెడ్‌షీట్లను తొలగించి, ఎప్పటికప్పుడు తాజా వాటిని ఏర్పాటు చేయాలి; తుప్పు పట్టిన మంచా లను మార్చాలి. ప్రత్యేక నిఘా: వార్డుల పరిశుద్ధ్య నిర్వహణపై ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా ఉంచి, రోజువారీ పర్యవేక్షణ చేపట్టాలి. కఠిన చర్యలు: విధుల్లో నిర్లక్ష్యం వహించి, ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న సిబ్బందిపై వేటు వేయాలి. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు కొండంత భరోసా ఇవ్వాలి కానీ, నిర్లక్ష్యానికి నిలయంగా మారకూడదు. పసికందుల ప్రాణాలతో ముడిపడిన ఈ దారుణ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఆశాల వినతిపై నిరాకరణ!

- పీహెచ్‌సీ గోడకే వినతిపత్రం అతికించి నిరసన
- ధరూర్ మెడికల్ అధికారిణి వైఖరిపై ఆశా కార్యకర్తల ఆగ్రహం

**ధరూర్, అక్టోబర్ 24 (వుదయం బ్యూరో)**

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించేందుకు వెళ్లిన ఆశా కార్యకర్తలకు నిరాశ ఎదురైంది. ధరూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) మెడికల్ అధికారిణి వినతిపత్రాన్ని స్వీకరించేందుకు నిరాకరించారని వారు ఆరోపించారు. దీంతో ఆగ్రహించిన ఆశా కార్యకర్తలు వినతిపత్రాన్ని పీహెచ్‌సీ గోడకు అతికించి నిరసన తెలిపారు. ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి మద్దతుగా వారు వినతిపత్రం అందజేసేందుకు వెళ్లారు.



గతంలోనూ అధికారిణి తమ పట్ల కించపరిచేలా వ్యవహరించారని ఆశాలు ఆరోపించారు. తమ సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడం తగదని మండిపడ్డారు. అధికారిణి వైఖరిలో మార్పు రాకుంటే రాబోయే రోజుల్లో పీహెచ్‌సీ ఎదుట పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరపాలని కోరారు.

# నీటిని పొదుపు చేయండి – భవిష్యత్తును కాపాడండి

**సదాశివపేట మునిసిపాలిటీ ప్రజలకు మునిసిపల్ కమిషనర్ పిలుపు**

**సదాశివపేట అక్టోబర్ 24 (వు ద యం):**




సదాశివపేట పట్టణ పరిధిలో భూగర్భజలాలు వేగంగా పడిపోతున్నాయని, ఫలితంగా నీటి నిల్వలు గణనీయంగా తగ్గుతున్నాయని సదాశివపేట మునిసిపాలిటీ అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో నీటి ఎద్దడి తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని పొదుపు చేయాలని కోరారు. మన పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

నీటిని ఎలా పొదుపు చేయాలి? (ప్రజలు పాటించాల్సిన అంశాలు):

నల్లాల నిర్వహణ: కుళాయిలను అనవసరంగా వదిలేసి నీటిని వృథా చేయకూడదు.

వ్యక్తిగత అవసరాలు: ముఖం, కాళ్లు కడిగేటప్పుడు లేదా బ్రష్ చేసుకునే సమయంలో మూతి పొడవునా నీళ్లు వదిలేయకుండా చూసుకోవాలి.

గృహోపకరణాలు: వాషింగ్ మెషిన్లు, గీజర్లను అవసరమైన మేరకే వాడుతూ నీటి వినియోగాన్ని తగ్గించాలి.

అతిథి మర్యాదలు: ఇంటికి వచ్చే అతిథులకు తాగడానికి సరిపడా నీటిని మాత్రమే ఇవ్వాలి.

RO ఫిల్టర్లు: వాటర్ ప్యూరిఫైయర్లు (RO) ద్వారా బయటకు వచ్చే వేస్ట్ నీటిని వృథా చేయకుండా ఇతర పనులకు ఉపయోగించాలి.

వాహనాల శుభ్రత: కార్లు, బైక్‌ల వంటి వాహనాలను కడగడానికి పైపులతో నీటిని వృథా చేయకుండా తడి గుడ్డతో శుభ్రం చేసుకోవాలి.

లీకేజీల నివారణ: పైపుల్లో నీటి లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

నిబంధనల ఉల్లంఘనపై చర్యలు: పైపుల్లో అక్రమ కనెక్షన్లు, లీకేజీలు ఉన్నా పట్టించుకోకపోవడం, రోడ్లపై నీటిని వదిలేయడం వంటి చర్యలకు పాల్పడితే జరిమానా తప్పదు.

అవగాహన కల్పన: వార్డులు, గ్రామాల్లో మైకుల ద్వారా నీటి పొదుపుపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం తేవాలి.

ప్రచార సాధనాలు: ప్రింట్, ఎలక్ట్రానిక్ మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా నీటి సంరక్షణపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలి.

మునిసిపాలిటీ తరపున చేపట్టే ప్రత్యేక చర్యలు:

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెరిగేలా చర్యలు తీసుకోవడం.

పట్టణంలోని చెరువులు, కుంటలను సంరక్షించడం.

హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, ప్రతి ఇంట్లో మొక్కలు పెంచేలా ప్రోత్సహించడం.

వర్షపు నీరు నేరుగా భూమిలోకి ఇంకేలా ఇంకుడు గుంతల (ఇన్‌ఫిల్ట్రేషన్) నిర్మాణాలను చేపట్టడం.

"నీటిని పొదుపు చేద్దాం – సదాశివపేటను సస్యశ్యామలం చేద్దాం" అనే నినాదంతో పట్టణ పౌరులంతా సహకరించాలని సదాశివపేట మునిసిపాలిటీ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# డాక్టరేట్ పొందిన వంకేశ్వరం నిరంజన్ కు ఘన సన్మానం

**నాగర్ కర్నూల్, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**

డాక్టరేట్ పొందిన వంకేశ్వరం నిరంజన్ కు జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానం నిర్వహించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ, డాక్టరేట్ పొందడం సంతోషంతో పాటు బాధ్యతను పెంచిందని, దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. విద్య వ్యక్తిగత అభివృద్ధికే కాక సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని, దళితులు, బడుగు బలహీనవర్గాల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పేదల సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల మధ్య ఉండి పోరాటం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి కెవిపిఎస్ నాయకులు గుంపెల్లి అశోక్ అధ్యక్షత వహించారు. సీపీఎం సీనియర్ నాయకులు అబ్దుల్లా ఖాన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, మహేంద్రనాథ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొత్త పరశురాములు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు, సీఐటీయూ జిల్లా కోశాధికారి పొదిలి రామయ్య, హమాలి సంఘం అధ్యక్షులు రాధాకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. పోతుల కాశన్న, చింతలయ్య, మద్దిలేటి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# బక్కలింగాయపల్లిలో తమ్ముడి హత్య - అన్న అరెస్ట్

**అచ్చంపేట, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**

అచ్చంపేట నియోజకవర్గం సిద్దాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బక్కలింగాయపల్లి గ్రామంలో బోరు మోటర్ విషయంలో చెలరేగిన గొడవ హత్యకు దారితీసింది. అచ్చంపేట సీఐ నాగరాజు ఏశమళ్ల తెలిపిన వివరాల ప్రకారం, అక్టోబర్ 23న బక్కలింగాయపల్లిలో అన్నదమ్ముల మధ్య బోరు మోటర్ విషయంలో గొడవ జరిగింది. గొడవ ముదరడంతో అన్న బావ్ సింగ్ తమ్ముడు కేతావత్ మోహన్ ను కట్టెతో కొట్టాడు. ఈ దాడిలో మోహన్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఈ ఘటనపై సిద్దాపూర్ పోలీసులు మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు బావ్ సింగ్ ను శనివారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.

# నేరేడు గుంట గ్రామానికి అరుదైన గౌరవం

**గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న బేగరి కావేరి**

**ఆందోల్, వుదయం**



సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండల పరిధిలోని నేరేడు గుంట గ్రామానికి చెందిన బేగరి కావేరికి అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా సంఘాల ద్వారా పలువురిని ప్రోత్సహిస్తూ, 25 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆమె కృషి చేశారు. బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకోవడంతో పాటు, రుణాల చెల్లింపులు సకాలంలో జరిగేలా సహకరించారు. ఈ సేవలను గుర్తించిన అధికారులు ఆమెకు ఉత్తమ గుర్తింపుగా అవార్డు అందజేశారు. కావేరి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం గ్రామానికి గర్వ కారణమని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ వాళ్లు జీర్ణించుకోలేకనే అబద్ధపు ప్రచారం

- బిఆర్ ఎస్ లో చేరిన వాళ్లంతా కాంగ్రెస్ వాళ్లే
- బిఆర్ ఎస్ మండల పార్టీ ప్రచార కార్యదర్శి బిక్షపతి

**వుదయం న్యూస్ శివ్వంపేట అక్టోబర్ 24....**



మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని దొంతి గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొంతమంది బి ఆర్ ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర ప్రచారాలు చేసుకోవడం మానుకోవాలని బి ఆర్ ఎస్ మండల పార్టీ ప్రచార కార్యదర్శి బుద్ధుల బిక్షపతి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత సర్పంచి ఎలక్షన్లో వార్డు మెంబర్గా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన సీనియర్ నాయకులు సుక్క సుధాకర్ తన అనుచరులతో కలిసి బి ఆర్ ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఇది జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీ నాయకులు వారు కాంగ్రెస్ వారు కాదని మా పార్టీ నుంచి ఎవరు పోలేరని చెప్పుకోవడం సిగ్గుచేటని వారు కాంగ్రెస్ నుంచి వచ్చారని ఇట్టి విషయాన్ని రుజువు చేయడానికి మేము రెడీ అని మీరు రెడీయా అని బి ఆర్ ఎస్ మండల పార్టీ ప్రచార కార్యదర్శి బుద్ధుల బిక్షపతి మండిపడ్డారు. పరువు పోతుందని మా పార్టీ వారు కాదని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసము వారే ఆత్మ విమర్శలు చేసుకోవాలని ఆయన హితవు పలికారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు గట్టి బుద్ధి చెప్తారని దానికి వారు రెడీగా ఉండాలని హితవు పలికారు. ఇకనైనా ఇలాంటి అబద్ధాపు ప్రచారాలు మానుకోవాలని తెలిపారు.

# రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బొమ్మారెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు,అందజేత**

**సంగారెడ్డి వుదయం**



బొమ్మారెడ్డిగూడెం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్-14 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలవగా, వారి ప్రతిభను అభినందించిన కలెక్టర్ సర్టిఫికెట్లు, షీల్డులను అందజేసి సత్కరించారు.ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జె. సాయిచరణ్, ఉమేష్, చిన్నా, బబ్లూలను డీడీ అఖిలేష్ రెడ్డి, పీఈటీ సోనేష్ నాయక్, పాఠశాల హెచ్‌డబ్ల్యూఓ పి. భవాని అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించి, వారి ప్రతిభను గుర్తించిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పిఈటి విఠల్ , ఇండియా కోచ్ జైపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణుల గళం.. జడ్చర్లలో శంఖారావం!

- సమస్యల పరిష్కారం కోసం సమరనాదం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బ్రాహ్మణుల ఐక్యగర్జనకు సన్నాహాలు
- గద్వాల నుంచి ప్రత్యేక బస్సులు.. తరలిరావాలని ప్రాణేష్ పిలుపు

**గద్వాల, అక్టోబరు 24 (వుదయం బ్యూరో)**

24: ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై గళమెత్తేందుకు బ్రాహ్మణులు ఐక్యంగా ముందుకు రావాలని జోగులాంబ గద్వాల జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రాణేష్ పిలుపునిచ్చారు. బ్రాహ్మణుల ఐక్యతను చాటుతూ, సమస్యల పరిష్కారం కోసం సమష్టి సంకల్పాన్ని చాటాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ నెల 25న జడ్చర్లలో నిర్వహించనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బ్రాహ్మణ శంఖారావాన్ని విజయవంతం చేయాలని కోరారు.

**ఐక్యంగా కదలాలి.. గళమెత్తాలి!**

గత ఎన్నో ఏళ్లుగా బ్రాహ్మణులు ఎదుర్కొం టున్న సమస్యలు పరిష్కారానికి నోచుకో వడం లేదని ప్రాణేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం బ్రాహ్మణులంతా ఏకతాటిపైకి వచ్చి తమ సంఘటిత శక్తిని చాటాలని సూచించారు. వ్యక్తిగత ప్రయత్నాలకు పరిమితం కాకుండా, సమష్టిగా సాగితేనే సమస్యలపై బలమైన స్వరం వినిపించ గలమని తెలిపారు. ఈ నేప థ్యంలో ప్రతి బ్రాహ్మణ కుటుంబం శంఖారావం లో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.



**జడ్చర్లలో మధ్యాహ్నం 2 గంటలకు..**

జడ్చర్లలోని గంగాపురం రోడ్డులో ఉన్న వాసవి కళ్యాణ మండపంలో ఈ నెల 25న మధ్యాహ్నం 2 గంటలకు శంఖారావం జరగనుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని బ్రాహ్మణ సోదరులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రాణేష్ కోరారు. గద్వాల నుంచి ప్రత్యేక బస్సులు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని కోట శ్రీ భూలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయం నుంచి ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరనున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని జడ్చర్లకు తరలిరావా లని విజ్ఞప్తి చేశారు. బ్రాహ్మణుల ఐక్యతను చాటుతూ, సమస్యల పరిష్కార దిశగా జరిగే శంఖారావాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వంద పడకల దవాఖానలో వీల్ చైర్ కరువు

- 70 ఏళ్ల వృద్ధురాలిని చంకలో మోసిన మనవడు
- వీడియో వైరల్, సర్కారు వైద్యంపై విమర్శలు

**అచ్చంపేట, అక్టోబర్ 24 (వుదయం ప్రతినిధి):**



పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అధ్వాన్నంగా ఉందనడానికి అచ్చంపేట 100 పడకల ప్రభుత్వ దవాఖానలో జరిగిన ఘటనే నిదర్శనం. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం సింగారం గ్రామానికి చెందిన వర్దం జంగమ్మ (70) తీవ్ర అనారోగ్యంతో నడవలేని స్థితికి చేరుకుంది. దీంతో ఆమె మనవడు ఆంజనేయులు గురువారం ఆమెను అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తీసుకువచ్చాడు. ఆటో దిగిన తర్వాత మెయిన్ గేటు నుంచి ఓపీడీ వరకు తీసుకెళ్లడానికి వీల్ చైర్ లేదా స్ట్రెచర్ కోసం ఎదురుచూసినా సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో మనవడు వృద్ధురాలిని చంకలో ఎత్తుకుని సుమారు 150 మీటర్ల దూరం హాస్పిటల్ కారిడార్ లోని వాటర్ ఫిల్టర్, బెంచీల మధ్య నుంచి యువ క్లినిక్ బోర్డు ఉన్న గది వరకు మోసుకెళ్లి డాక్టర్ ఛాంబర్ లోకి తీసుకెళ్లాడు. ఈ దృశ్యాలను ఎవరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ గా మారింది. రోజూ 300 మందికి పైగా ఓపీడీకి వచ్చే వంద పడకల దవాఖానలో కనీసం 2-3 వీల్ చైర్లు కూడా లేకపోవడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఎంహెచ్ఓ స్పందించి విచారణ జరిపి వీల్ చైర్లు, స్ట్రెచర్లు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

# సదాశివపేటలో నీటి పొదుపుపై ప్రత్యేక అవగాహన!

**సదాశివపేట అక్టోబర్ 24 (వు ద యం):**



మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రేణుకా చిరు ఆధ్వర్యంలో పట్టణంలో నీటి పొదుపుపై అవగాహన కల్పించడంతో పాటు ప్రతి ఇంటికి నల్లా ట్యాప్‌లు బిగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రేణుకా చిరు మాట్లాడుతూ ప్రతి ఇంటికి నల్లా ట్యాప్ బిగించుకోవాలని, అవసరమైనప్పుడు మాత్రమే నీటిని వినియోగించాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. వేసవి కాలంలో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నల్లా ట్యాప్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

# వట్వార్లపల్లి పునరావాసంలో వివాదం

**మాజీ సర్పంచ్ ఛత్రా నాయక్ బల వంతపు తరలింపు సమావేశం ఏర్పాటు చేసి ఆరోపణ**

**అచ్చంపేట, అక్టోబర్ 24:(వుదయం ప్రతినిధి )**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజక వర్గం నల్లమల దూతట్టు ప్రాంతం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాలోని ఐదు గ్రామాల తరలింపు వ్యవహారం తీవ్ర వివాదంగా మారింది. వట్వార్లపల్లి మాజీ సర్పంచ్ ఛత్రు నాయక్ శనివారం గ్రామ యువకులతో సమావేశం నిర్వహించి బలవంతంగా అడవి నుండి ప్రజలను తరలిస్తున్నారని ఆరోపించారు .

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ కోర్ ఏరియాను పులులకు అభయారణ్యంగా పూర్తిగా ఖాళీ చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ, NTCA అనుమతితో తెలంగాణ ప్రభుత్వం ఐదు గ్రామాలను తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**గ్రామాలు:** సార్లపల్లి, కొల్లంపెంట, కుడిచింతలబయలు, తాటిగుండాలపెంట, వట్వార్లపల్లి

–దశలు: ఫేజ్–1 లో 417 కుటుంబాలు, ఫేజ్–2 లో వట్వార్లపల్లితో సహా 836 కుటుంబాలు (మొత్తం 1253 కుటుంబాలు)

**పునరావాస ప్రాంతం:** పెద్దకొత్తపల్లి మండలం బాచారం రిజర్వ్ ఫారెస్ట్ లో 1501 హెక్టార్ల భూమిని డీ–నోటిఫై చేసి ఇళ్ల స్థలాలు ఇస్తున్నారు.

**ప్యాకేజీ:** రెండు ఆప్షన్లు – ఆప్షన్–1: రూ. 15 లక్షల నగదు, ఆప్షన్–2: 220 గజాల ఇంటి స్థలం + 2 నుండి 5 ఎకరాల వ్యవసాయ భూమి + బ్యాంకులో రూ. 3 లక్షల డిపాజిట్. 18 ఏళ్లు దాటిన ప్రతి కొడుకు/కూతురుని ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తారు. దీనిపై వటువర్ల పల్లి మాజీ సర్పంచ్ ఛత్రు నాయక్ స్పందిస్తూ బలవంతపు సంతకాలు: గ్రామసభ తీర్మానాలు సరిగా జరగలేదు,

**బెదిరింపులు:** అడవిలో కరెంట్, నీళ్లు, రోడ్డు, అంగన్వాడీ, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వమని, భవిష్యత్తులో సౌకర్యాలు ఆపేస్తామని అటవీ అధికారులు బెదిరిస్తున్నారని వట్వార్లపల్లికి చెందిన చెంచు మహిళలు మండ్ల ఈడమ్మ, చిగుర్ల ఈరమ్మ గతంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

**కేసులు:** తరలింపును వ్యతిరేకిస్తున్న యువకులపై అక్రమ కేసులు పెడుతున్నారని సర్లపల్లి మాజీ సర్పంచ్ చిగుర్ల మల్లికార్జున్ ఆరోపించారు.

దీనికి మద్దతుగా చెంచు సాలిడారిటీ ఫోరమ్ (సి ఎస్ ఎఫ్ ), హ్యూమన్ రైట్స్ ఫోరమ్ , దళిత బహుజన ఫ్రంట్ వంటి సంస్థలు ఏప్రిల్ 17, 2026 న హైదరాబాద్ లో గవర్నర్ ని కలిసి వినతిపత్రం ఇచ్చాయి. "ఇది స్వచ్ఛంద తరలింపు కాదు, ప్రలోభాలు, బెదిరింపులతో కూడిన బలవంతపు తరలింపు, ఇది PESA Act 1996, ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ 2006, LARR Act 2013 కి విరుద్ధం" అని ఆరోపిస్తున్నారు.అయితే ఫ్యాక్ట్ ఫైండింగ్ టీం రిపోర్ట్ ప్రకారం – ర్యాలీలో పాల్గొన్న వారిలో ఒక్కరే చెంచు, మిగతా అందరూ నాన్–చెంచులు, అప్పటికే పట్టణాలకు వెళ్లిపోయిన వారే తరలింపును కోరుకుంటున్నారని, అడవిలో ఉంటున్న అసలు చెంచులు మాత్రం వెళ్లడానికి ఇష్టపడటం లేదని తేల్చింది.



# అనవసర ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

- అపోహలు సృష్టించొద్దు.. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి
- పార్టీ కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం సరికాదు
- బషీరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల మీడియా సమావేశం



**బషీరాబాద్ వుదయం అక్టోబర్ 24:**

పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకులపై అనవసర ఆరోపణలు చేస్తూ, తప్పుడు ప్రచారాలతో వారి ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నాలను మానుకోవాలని బషీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి హితవు పలికారు. ఏవైనా అభ్యంతరాలు, సమస్యలు ఉంటే నేరుగా చర్చించి పరిష్కరించుకోవాలే తప్ప, వెనుక ఉండి విమర్శలు చేయడం, అపోహలు సృష్టించడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. పార్టీ ఐక్యతను దెబ్బతీసే చర్యలకు స్వస్తి పలికి, అందరూ సమన్వయంతో ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. శనివారం బషీరాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ శంకరప్ప, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గానికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తాను పార్టీ కార్యక్రమాల గురించి సమాచారం ఇవ్వడం లేదంటూ కొందరు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని రాజ వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి సర్పంచులు, గ్రాడ్యుయేట్లను ఆహ్వానించే సమయంలో తామే స్వయంగా ఫోన్ చేసి పార్టీ నాయకులకు సమాచారం అందించామని తెలిపారు.

మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులకు సమావేశాలు, ఇతర కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని స్పష్టం చేశారు. అలాంటప్పుడు సమాచారం ఇవ్వలేదని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ కండువా కప్పుకున్నప్పటి నుంచి పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య అపోహలు సృష్టించే ప్రయత్నాలు చేయకుండా వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. పార్టీలో ఎవరికైనా ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే నేరుగా తమ వద్దకు వచ్చి చర్చించాలని, అవసరమైతే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనవసర విమర్శలు, తప్పుడు ప్రచారాల వల్ల పార్టీకి నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొంటూ, వ్యక్తిగత విమర్శలకు దూరంగా ఉండి పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మాగనూర్ పెద్దవాగు ఇసుక దోపిడీని అరికట్టి భూగర్భ జలాలను కాపాడండి!



## బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య

**మాగనూర్ అక్టోబర్ 24 (వుదయం న్యూస్)**

మాగనూర్ పెద్దవాగు నుంచి ఇసుక దోపిడీని అరికట్టి భూగర్భ జలాలను కాపాడాలని, ఆ వాగు నీటిపై ఆధారపడి రెండు పంటలు పండించుకునే రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య డిమాండ్ చేశారు. బీజేపీ బృందంతో కలిసి ఆయన ఈరోజు దాసరి దొడ్డి వద్ద గల పెద్దవాగును పరిశీలించారు. దాసరి దొడ్డికి చెందిన ఒక వ్యక్తి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా ఇసుకను దోచుకున్నాడని, ఇప్పుడు అదే వ్యక్తి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నాడని అన్నారు. ఇసుక దోపిడీదారులు జాతీయ రహదారి మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే మంత్రి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు తక్షణమే స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకప్పుడు బంగారు వర్ణంలో దగదగా మెరిసే ఇసుకతో కళకళలాడిన పెద్దవాగు నేడు ఇసుక దోపిడీ వల్ల మొరం, మట్టి తేలి, పిచ్చి మొక్కలతో నిండిపోయిందని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వాగుపై ఆధారపడి 16 గ్రామాల రైతులు హ్యాండ్ బోర్లు, బావుల ద్వారా రెండు పంటలు పండించుకునేవారని, నేడు భూగర్భ జలాలు అడుగంటడంతో ఒక్క పంట కూడా పండించుకోలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికైనా మంత్రి, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం తక్షణమే స్పందించి ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని, అక్రమ ఇసుక దోపిడీని పూర్తిగా అరికట్టి రైతులకు న్యాయం చేయాలని కొండయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు: బీజేపీ ఓబీసీ అధికార ప్రతినిధి శంకరుల రవికుమార్, కల్లూరి నాగప్ప, మల్లికార్జున్, మున్సిపల్ కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి, నారాయణ, చిట్యాల లక్ష్మణ్, ప్రతాపరెడ్డి, విద్యాసాగర్, అశోక్ గౌడ్, బ్యాటరీ రాజు, కానాపురం రాములు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు షూస్, సాక్సుల పంపిణీ

- విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది
- క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: సర్పంచ్ లాలు, ఉపసర్పంచ్ నాగరాజు

**దౌల్తాబాద్, అక్టోబర్ 24 (వుదయం):**

మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు షూస్, సాక్సుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఏఏపీసీ చైర్మన్ రేణుక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ లాలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ లాలు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు వారి అభ్యున్నతికి ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని, క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరవుతూ చదువులో రాణించాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామ ఉపసర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. పట్టుదల, కృషి, క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ తిరుమలాపూర్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు నరేందర్, శ్రీనివాస్, మహేశ్వరి, నగేష్ పాల్గొన్నారు. అలాగే ఎంపీపీఎస్ తిరుమలాపూర్ ప్రధానోపాధ్యాయుడు ప్రశాంత్, ఉపాధ్యాయులు గోపాల్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మీయతకు చిరునామా సోమిరెడ్డి..

**దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**

**వుదయం, తెల్లాపూర్ ప్రతినిధి (అక్టోబర్ 24)**

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం కేసీఆర్ నగర్ ఫేజ్–2కు చెందిన బీఆర్ఎస్ నాయకులు తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మల్లేపల్లి సోమిరెడ్డిని తెల్లాపూర్ లోని అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీరాధర్ ఆంజనేయులు, మల్లేష్ యాదవ్, కోటేష్ నాయక్, రవి, అనిల్, సుధాకర్, మహేష్, పాండు నాయక్, రామ్ చరణ్, రామ్ రెడ్డి, శంకర్, గోపి, మధు చారి, శ్రీనివాస్ చారి, నగేష్ చారి, జనార్దన్ రెడ్డి, అజయ్, రాము తదితరులతో పాటు టీమ్ పవన్ పుత్ర సభ్యులు శివ, కార్తీక్, సాయి, రాము, పవన్, అజయ్ పాల్గొన్నారు.

# అర్ధరాత్రి వేళ రోడ్డు ప్రమాదం

**వుదయం ప్రతినిధి నిజాంపేట**



మండలం అర్ధరాత్రి వేళ జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడగా.. నలుగురికి తీవ్ర గాయాలైనట్లు సమాచారం. నిజాంపేటలోని మసీదు వద్ద అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద సమయంలో కారులో సుమారు పది మంది ఉన్నట్లు తెలిసింది.ఈ ఘటనలో శ్రావ్య, శ్రావణి, కాశమ్మ, విజయ, కొండలరావు, వీరగుంటయ్య తదితరులు గాయపడినట్లు సమాచారం. వీరిలో నలుగురి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం బాధితుల బంధువులు మెరుగైన వైద్యం కోసం వారిని నిజామాబాద్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# ఎంపీ నిధులతో మహిళా సమైక్య భవనం సర్పంచ్ శైలజ శ్రీనివాస్

**వుదయం ప్రతినిధి నిజాంపేట**



మండలంలోని బచ్చురాజు పల్లి గ్రామంలో ఈరోజు మెదక్ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మహిళా సమైక్య భవనాన్ని SHG గ్రామ సర్పంచ్ శైలజ శ్రీనివాస్ భూమి పూజ చేయడం జరిగింది, ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామానికి మహిళా సమైక్య భవనానికి నిధులు మంజూరు చేసిన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు గ్రామ ప్రజల తరపున, మహిళా సమాఖ్య సభ్యుల తరపున ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సల్మాన్, ఏపీఎం అశోక్, అమృత, పంచాయతీ కార్యదర్శి రాములు, ఉప సర్పంచ్ రాజశేఖర్ మరియు పాలకవర్గం, వివో లీడర్లు మంజుల, రాజేశ్వరి,వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని 'ఎంపీ'కి వినతి"

**ఝరాసంగం అక్టోబర్-24(వుదయం ప్రతి నిధి)**





జహీరాబాద్: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (LIAFI) భవన నిర్మాణం కోసం జహీరాబాద్‌లో స్థలం కేటాయించాలని కోరుతూ గౌరవ పార్లమెంట్ సభ్యులు శ్రీ సురేష్ కుమార్ షెట్కార్ గారికి LIAFI ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.దీనికి ఎంపీ గారు సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చుపాలిఅని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా LIAFI జహీరాబాద్ మరియు నారాయణఖేడ్ అధ్యక్షులు E. విఠల్ గౌడ్,LIAFI ట్రెజరర్ పోలీస్ ప్రవీణ్ పాటిల్, సీనియర్ ఏజెంట్లు S. నాగయ్య, పరమేశ్వర్ పాటిల్, CH. బాబూజీతో పాటు పలువురు ఏజెంట్ మిత్రులు పాల్గొన్నారు. LIAFI భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించి, ఏజెంట్లకు ఉపయోగపడే భవన నిర్మాణానికి సహకరించాలని వారు ఎంపీని కోరారు. ఈ భవనం ద్వారా ఏజెంట్ల సమావేశాలు, సంస్థాగత కార్యక్రమాలు నిర్వహించేందుకు సౌకర్యం కలుగుతుందని ప్రతినిధులు తెలిపారు. LIAFI భవన నిర్మాణానికి స్థలం కేటాయించే విషయంలో సానుకూలంగా స్పందించి సహకరించాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# వీరారెడ్డిపల్లి టూ మల్లుపల్లి బీటీ రోడ్డు మంజూరు చేయాలి

- దశాబ్దాల రవాణా నరకం.. సిద్దిపేటకు దగ్గరి మార్గమైనా తప్పని తిప్పలు!
- సిద్దిపేటకు అత్యంత దగ్గరి మార్గం
- అత్యవసర ప్రయాణాల కోసం త్వరగా బీటీ రోడ్డు మంజూరు చేయాలి
- వీరారెడ్డి పల్లి గ్రామ సర్పంచ్ బాల మల్లేశం గౌడ్ విజ్ఞప్తి!

**అక్బర్ పేట భూంపల్లి అక్టోబర్ 24 ( వుదయం ప్రతినిధి )**



సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామం నుండి మల్లుపల్లి రోడ్డు వరకు, అలాగే జంగపల్లి గ్రామం నుండి వీరారెడ్డిపల్లి గ్రామం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వేయించాలని ఎన్నో ఏళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వీరారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ చాట్లపల్లి బాల మల్లేశం గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నిత్యం ఎమర్జెన్సీ వైద్య అవసరాల నిమిత్తం సిద్దిపేట పట్టణానికి వెళ్ళడానికి ఈ మార్గం ద్వారా ప్రయాణిస్తే చాలా దగ్గరగా ఉంటుందని, కానీ రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో దశాబ్దాలుగా రవాణా కష్టాలు తప్పడం లేదని ఆయన పేర్కొన్నారు. కావున స్థానిక దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు,దుబ్బాక నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి లు ఈ గ్రామాల రోడ్డు సమస్యను ప్రత్యేక దృష్టిలో ఉంచుకొని, ప్రజల కష్టాలను తీర్చేందుకు త్వరగా బీటీ రోడ్డు మంజూరు చేయాలని వీరారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ బాల మల్లేశం గౌడ్ విజ్ఞప్తి చేశారు.

# రేపటి ప్రజావాణి రద్దు

**జిల్లా కలెక్టర్ కె .హరిత**

**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 26 సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె .హరిత తెలిపారు. ఈనెల 26న కొమరం భీమ్ వర్ధంతి సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. తమ సమస్యలపై దరఖాస్తులను మీసేవ యాఫ్ ద్వారా సమర్పించుకోవచ్చన్నారు.

# వాల్మీకి ఎస్టీ సాధన ర్యాలీతో దద్దరిల్లిన గద్వాల




- మైదాన ప్రాంత వాల్మీకులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలి
- 70 ఏళ్లుగా పోరాడుతున్నా న్యాయం జరగడం లేదని నేతల ఆవేదన

**గద్వాల, అక్టోబర్ 24 (వుదయం బ్యూరో)**

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వాల్మీకి ఎస్టీ సాధన సంకల్ప ర్యాలీ, సభలో నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ మెట్ట నుంచి నల్లకుంట కాలనీలోని వాల్మీకి భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, ఎస్టీ హోదా సాధనకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన సంకల్ప సభలో తమ డిమాండ్లను వినిపించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ, తెలంగాణ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు శ్యామల హనుమంతు నాయుడు సహా పలువురు వాల్మీకి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బాసు శ్యామల హనుమంతు నాయుడు మాట్లాడుతూ.. వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో సుమారు 70 ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా ఆశించిన ఫలితం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాల్మీకుల ఎస్టీ హోదా అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. వాల్మీకుల సమస్యపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రాజకీయ పార్టీలు వాల్మీకులకు న్యాయం చేసే దిశగా చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. 2015లో అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెల్లప్ప కమిషన్ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి, వాల్మీకి బోయలు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నందున వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని సిఫారసు చేసినట్లు ఆయన గుర్తుచేశారు.

ఈ సిఫారసుల ఆధారంగా 2016, 2023 సంవత్సరాల్లో తెలంగాణ అసెంబ్లీలో తీర్మానాలు చేసినప్పటికీ, ఇతర కులాలను కూడా కలిపి ప్రతిపాదించడం వల్ల కేంద్రం నుంచి ఆమోదం లభించలేదని పేర్కొన్నారు.

**1977లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలి**

వాల్మీకులు 1968లో ఎస్టీ జాబితాలో ఉన్నప్పటికీ, 1977లో ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితం చేశారని బాసు శ్యామల హనుమంతు నాయుడు పేర్కొన్నారు. 1977 జూలై 27న జరిగిన మార్పులను సరిదిద్ది, మైదాన ప్రాంతాల్లో నివసించే వాల్మీకి బోయలకు కూడా ఎస్టీ హోదాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా “మా ఎస్టీ హోదా మాకు కావాలి.. గద్వాలలో వాల్మీకి జెండా ఎగరాలి” అంటూ నాయకులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో వివిధ వాల్మీకి సంఘాల నాయకులు, మండల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామస్థాయి నాయకులు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోర్టు డ్యూటీ అధికారులు కోర్టు లైజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ డి.జానకి

**24 అక్టోబర్ మహబూబ్ నగర్ ( వుదయం )**



మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ కోర్టు డ్యూటీ అధికారులు కోర్టు లైజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు విచారణల పురోగతి నేర నిరూపణకు తీసుకోవాల్సిన చర్యలు పోలీసు అధికారులు మరియు ప్రాసిక్యూషన్ మధ్య సమన్వయం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ మాట్లాడుతూ ప్రతి కేసులో దర్యాప్తు అధికారులు సేకరించిన ఆధారాలు సాక్షుల వాంగ్మూలాలు సంబంధిత పత్రాలు చట్టపరమైన నిబంధనల ప్రకారం కోర్టులో సమర్థవంతంగా ప్రవేశపెట్టేలా కోర్టు డ్యూటీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా కోర్టు విధించిన గడువులు ఆదేశాలను పాటిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు.

# భూముల రీ సర్వే పగడ్బందీగా నిర్వహించాలి

**సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్**

**ఆసిఫాబాద్,( వుదయం ప్రతినిధి ):**




జిల్లాలో కడాస్ట్రల్ మ్యాపులు లేని గ్రామాల్లో భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, భూ కొలతల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... రీ సర్వేలో రైతులందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నివసించని రైతుల వివరాలు, వారి ఫోన్ నంబర్లను వ్యవసాయ అధికారుల ద్వారా సేకరించి సమన్వయం చేసుకోవాలన్నారు. సర్వేకు ముందుగానే రైతులకు సమాచారం అందించాలని, అటవీ హక్కులను గుర్తిస్తూ సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ కె.హరిత, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో కడాస్ట్రల్ మ్యాపులు లేని గ్రామాలను గుర్తించి మొదటి విడత సర్వే పూర్తి చేశామని తెలిపారు. రెండో విడతలో మండలానికి రెండు గ్రామాల చొప్పున రీ సర్వేను పగడ్బందీగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సర్వే వివరాలు గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రచారం చేయడంతో పాటు దూర ప్రాంతాల్లో ఉన్న రైతులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే ఏడి వినయ్ రెవెన్యూ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు పీఎం రాహత్ పథకం ద్వారా ఆర్థిక సహాయం

## సీఎస్ సంజయ్ జాజు

**ఆసిఫాబాద్,( వుదయం ప్రతినిధి):**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రధానమంత్రి రహత్ పథకం ద్వారా రూ.1.50 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదంలో గాయపడిన వారి వివరాలను 24 గంటల్లోపు, తీవ్రంగా గాయపడిన వారి వివరాలను 48 గంటల్లోపు ఈ–దార్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పథకంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ కె.హరిత, ఎస్పీ నితికా పంత్, అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిఎం రహత్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందేలా జిల్లాలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ రహదారులు భవనాల శాఖ జాతీయ రహదారుల సంస్థ ఈ జార్ మేనేజర్ లక్ష్మణ్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.